www.prajanaava.in
Telugu Daily
ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పేజీలు : 08 | వెల రూ.5.00
Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 199 | బుధవారం | 15 జూలై, 2026

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
తెలుగు రాష్ట్రాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న
ప్రజానావ దినపత్రికలో అతి తక్కువ ధరకే ప్రకటనలివ్వండి!
వివరాలకు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
✆ : 99484 33277 / 9014966169

రూట్ క్లియర్ చేయండి

పనుల ప్రారంభానికి అనుమతులివ్వండి

- కొత్త రహదారులతో తెలంగాణ ఆర్థిక ప్రగతికి మరింత ఊతం
- కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీకి సీఎం రేవంత్ రెడ్డి వినతి
- హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే, మన్ననూరు–శ్రీశైలం కారిడార్‌పై కీలక చర్చలు

ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం భూసేకరణ 95శాతం పూర్తి

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసి పనులు వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తయినందున నిర్మాణ పనుల ప్రారంభానికి కేంద్ర కేబినెట్ అనుమతి ఇప్పించాలని కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి నివాసంలో మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు కీలక రహదారి ప్రాజెక్టుల పురోగతి, అనుమతులపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర, దక్షిణ భాగాల నిర్మాణ పనులను ఒకేసారి ప్రారంభిస్తే ప్రాజెక్టు త్వరగా పూర్తవుతుందని, నిర్మాణ వ్యయం కూడా తగ్గుతుందని సీఎం వివరించారు. దక్షిణ భాగానికి సంబంధించిన అవసరమైన అనుమతులను కూడా త్వరగా మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు నగర విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధికి ఆర్ఆర్ఆర్ కీలకంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు.

హైదరాబాద్–అమరావతికి 12 వరుసలు

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్–అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. భారత్ ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టు వరకు 12 వరుసల రహదారి నిర్మిస్తే హైదరాబాద్–విజయవాడ మధ్య దూరం సుమారు 100 కిలోమీటర్లు

తరువాయి 2లో..

ఆకాశమే హద్దుగా..

- అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేయాలి
- ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలతో ఏరో హబ్‌లుగా తీర్చిదిద్దాలి
- పౌర విమానయాన మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- పనుల పురోగతి, డిజైన్లు, భవిష్యత్ అవసరాలపై చర్చ

2

తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. రెండు విమానాశ్రయాలను కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం చేయకుండా.. మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వంటి ఆధునిక సదుపాయాలతో ఏరోస్పేస్ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

సర్ గడువు పొడిగించండి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి కాంగ్రెస్ వినతి
- హైదరాబాద్‌లో నత్తనడకన ప్రక్రియ: మంత్రి పొన్నం ప్రభాకర్
- ఇంటింటి సర్వేకు అదనపు సిబ్బందిని నియమించాలని సూచన
- 99.99% ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందన్న ఎన్నికల సంఘం

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ గడువును పొడిగించాలని అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కోరింది. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకుల బృందం మంగళవారం సీఈవోను కలిసి వినతిపత్రం అందజేసింది. ముఖ్యంగా హైదరాబాద్‌లో ప్రక్రియ ఆశించిన వేగంతో సాగడం లేదని, ఓటర్లందరికీ అవకాశం కల్పించాలంటే గడువు పొడిగింపు అవసరమని కోరింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ జిల్లాలో సర్ ప్రక్రియ నత్తనడకన సాగుతోందని తెలిపారు. బూత్ లెవల్ అధికారులు తగిన స్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహించలేకపోతున్నారని, ఇప్పటివరకు నగరంలో కేవలం 15 నుంచి 20 శాతం మేరకే ప్రక్రియ పూర్తయి ఉండొచ్చని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో గడువు పెంచకపోతే పలువురు ఓటర్లు ఇబ్బందులు

తరువాయి 2లో..

రష్యాపై ఆంక్షల బిల్లు

- అమెరికా సెనేట్‌లో ఊపందుకున్న ప్రయత్నాలు
- లిండ్సే గ్రాహమ్ ఆశయానికి రూపమిచ్చే దిశగా అడుగులు
- రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాల ప్రతిపాదన
- చైనా, భారత్‌పైనా తీవ్ర ప్రభావం

2

అక్రమాస్తుల గుట్టురట్టు

- హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్‌పై ఏసీబీ కొరడా
- 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు
- రూ.9.24 కోట్ల ఆస్తులు..

భారీగా బంగారం, నగదు, బ్యాంకు డిపాజిట్ల గుర్తింపు

ప్రజానావ, హైదరాబాద్/పెద్దపల్లి: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) చీఫ్ ఇంజినీర్ రవీందర్ అక్రమాస్తుల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆయనపై ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు నమోదైన ఆరోపణలపై ఏసీబీ కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా మంగళవారం ఆయన నివాసం, కార్యాలయంతో పాటు బంధువులు, అనుచరులు, బినామీలకు చెందిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో రూ.9.24 కోట్లకు పైగా విలువైన ఆస్తులను గుర్తించినట్లు ఏసీబీ వెల్లడించింది. అధికారిని అరెస్ట్ చేసి న్యాయపరమైన రిమాండ్ నిమిత్తం నగర కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపింది. అధికారుల తనిఖీల్లో ఐదు ఓపెన్ ప్లాట్లు, నాలుగు నివాస ఫ్లాట్లు, నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి, ఒక సెమీ ఫర్నిష్డ్ విల్లా, గ్రౌండ్ ప్లస్ ఫోర్ (జీ+4) భవనానికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.3.82 లక్షల నగదు, సుమారు రూ.45 లక్షల బ్యాంకు డిపాజిట్లు, 1,440 గ్రాముల బంగారు ఆభరణాలు, 12.5 కిలోల వెండి వస్తువులు, విలువైన గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు, నాలుగు వాహనాలను అధికారులు గుర్తించారు. ఇప్పటివరకు లెక్కించిన ఆస్తుల విలువ సుమారు రూ.9.24 కోట్లుగా అంచనా వేస్తున్నట్లు ఏసీబీ

తరువాయి 2లో..

భారత నావికుల భద్రతకు ప్రత్యేక డ్యాష్ బోర్డ్

- ఓడల కదలికలపై రియల్‌టైమ్ నిఘా
- అందుబాటులోకి ప్రతి భారతీయ నావికుడి వివరాలు
- షిప్పింగ్ మంత్రి సోనోవాల్ ఆదేశాలు

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో సముద్ర భద్రతా పరిస్థితులు ఉద్రిక్తంగా మారుతున్న నేపథ్యంలో భారతీయ నావికుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. పర్షియన్ గల్ఫ్, హార్మూజ్ జలసంధి, ఒమన్ గల్ఫ్‌లో ప్రయాణిస్తున్న ప్రతి నౌకలో ఉన్న భారతీయ నావికుల వివరాలను రియల్‌టైమ్‌లో పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని షిప్పింగ్ మంత్రి సర్బానంద సోనోవాల్ డైరెక్టరేట్

తరువాయి 2లో..

హార్మూజ్‌లో మళ్లీ మంటలు

టోల్ ఫీజు నిర్ణయం నుంచి వెనక్కి తగ్గిన ట్రంప్

- టోల్ ఫీజు నిర్ణయం నుంచి వెనక్కి తగ్గిన ట్రంప్
- అయినా ఆగని ఉద్రిక్తతలు
- అమెరికా వైమానిక దాడులకు ఇరాన్ ప్రతీకారం
- చమురు ట్యాంకర్లే లక్ష్యంగా వరుస దాడులు
- సంక్షోభంలో శాంతి ఒప్పందం
- ప్రపంచ ఇంధన మార్కెట్‌లో మళ్లీ కలవరం

దుబాయ్: ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధి మరోసారి ఉద్రిక్తతలకు కేంద్రబిందువుగా మారింది. జలసంధి గుండా ప్రయాణించే నౌకలపై టోల్ ఫీజు విధించాలన్న ప్రతిపాదన నుంచి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గినప్పటికీ, అమెరికా–ఇరాన్ మధ్య సైనిక ఘర్షణలు మళ్లీ తీవ్రరూపం దాల్చాయి. అమెరికా తాజా వైమానిక దాడులకు ప్రతిగా ఇరాన్ చమురు ట్యాంకర్లు, మిత్రదేశాలకు చెందిన వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడంతో ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. హార్మూజ్ జలసంధి భద్రత పేరుతో నౌకల సరుకు విలువలో 20 శాతం వరకు రుసుము వసూలు చేయాలన్న ప్రతిపాదనను ట్రంప్ ఇటీవల ప్రకటించారు. అయితే ఆ నిర్ణయాన్ని మంగళవారం ఉపసంహరించుకుంటూ, గల్ఫ్ దేశాలు అమెరికాలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయని తెలిపారు. దీంతో జలసంధి వినియోగంపై రుసుము విధించాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

ఇరాన్‌పై దాడులకు దీటుగా స్పందన

అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌లోని తీర రక్షణ వ్యవస్థలు, క్షిపణి, డ్రోన్ స్థావరాలు, సముద్ర రక్షణ సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుని మరో విడత వైమానిక దాడులు నిర్వహించినట్లు వెల్లడించింది. వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీయడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని అమెరికా పేర్కొంది. అమెరికా దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న చమురు ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకుంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన రెండు నౌకల్లో మంటలు చెలరేగగా, ఈ ఘటనలో ఇద్దరు నావికులు మృతి చెందారు. మరో 14 మంది గాయపడినట్లు అంతర్జాతీయ సముద్ర సంస్థ (ఐఎంఓ) వెల్లడించింది. ఒమాన్ తీరానికి సమీపంలో మరో చమురు ట్యాంకర్‌పైనా దాడి జరగడంతో నౌక ఇంజిన్ గదిలో మంటలు చెలరేగినప్పటికీ సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారు. పరిస్థితులు

తరువాయి 2లో..

మళ్లీ సముద్ర దిగ్బంధనం

హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో అమెరికా మరోసారి ఇరాన్ నౌకాశ్రయాలపై సముద్ర దిగ్బంధనాన్ని (బ్లాకేడ్) అమలు చేసింది. తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం బలహీనపడుతున్న వేళ పూర్తి స్థాయి యుద్ధం మళ్లీ చెలరేగే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా మొదట ఈ ఏడాది ఏప్రిల్ మధ్యలో ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనం విధించింది. అనంతరం జూన్ మధ్యలో తాత్కాలిక శాంతి ఒప్పందం కుదరడంతో దాన్ని ఎత్తివేసింది. ఆ ఒప్పందం ప్రకారం 60 రోజుల వ్యవధిలో ఇరాన్ అణు కార్యక్రమంపై శాశ్వత ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉండగా, హార్మూజ్ వద్ద మళ్లీ ఘర్షణలు పెరగడంతో చర్చలు నిలిచిపోయాయి.

ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధి

- **ఆస్పత్రుల్లో అభివృద్ధికి కొత్త పాలసీతో ముందుకు వెళుతున్నాం**
- **ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధులతో మంత్రి దామోదర సమీక్ష**

ప్రజానావ, హైదరాబాద్ : భద్రాద్రి కొత్తగూడెం సహా, రాష్ట్రంలోని అన్ని ట్రైబల్ ఏరియాల్లో ప్రభుత్వ హాస్పిటళ్ల అభివృద్ధికి కొత్త పాలసీని తీసుకొస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో, దశలవారీగా సీటీ స్కాన్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రజలకు సమీపంలో వైద్య సేవలు అందుబాటులో ఉండేలా దూరాన్ని బట్టి హాస్పిటళ్లను అభివృద్ధి చేస్తామని, అవసరమైన చోట కొత్త సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలను మంజూరు చేస్తామన్నారు. అవసరాన్ని బట్టి ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా హాస్పిటళ్లలను అప్‌గ్రేడ్ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కొత్తగూడెం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సెక్రటేరియట్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, కొత్తగూడెం ఎమ్మెల్యే నంనేని సాంబశివరావు, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనుకయ్య, అశ్వరావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ డాక్టర్ సంగీత సత్యనారాయణ, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవిందర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. ఈ రెండున్నర సంవత్సరాల్లో జిల్లాలోని ప్రభుత్వ దవాఖాన్లలో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యా యన్నారు. జిల్లాలో వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నారని, హాస్పిటళ్లలో అన్నిరకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆరోగ్యశాఖ అవేర్‌నెస్ కార్యక్రమాలు డా చేపడుతోందన్నారు. కొత్తగూడెం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే నంనేని సాంబశివరావు మంత్రిని కోరారు. ఎంసీహెచ్, జీజీహెచ్ నడుమ డిస్టన్స్ ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ఎంసీహెచ్‌కు ప్రత్యేకంగా ఒక ఇంచార్జ్ సూపరింటెండెంట్‌ను నియమించాలన్నారు. కొంత మంది డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నంనేని కోరారు. జిల్లాలో ప్రతి మండలానికి ఒక అంబులెన్స్, కొత్తగా 4 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేసినందుకుగానూ ఎమ్మెల్యేలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కమ్యునిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. కొత్తగూడెం జిల్లాల్లోని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ యంత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని పీహెచ్‌సీలలో 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా వాటిని అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. టీచింగ్ హాస్పిటల్, జిల్లా హాస్పిటల్, ఏరియా హాస్పిటళ్లు, సీహెచ్‌సీలలో జనరేటర్లు ఇటీవలే ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, తమది అటవీ ప్రాంతం అయినందున వర్షాల సమయంలో పవర్ కట్ సమస్య ఉంటుందని, ఈ సమస్యను దృష్టిలో పెట్టుకుని పీహెచ్‌సీలలోనూ జనరేటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. మంత్రి దామోదర మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అత్యంత మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు డా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అడవులు, కొండలు, దూర ప్రాంతాలు, రవాణా సమస్యలు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో అడ్డంకులు కాదదు అన్నారు. ఈ నేపథ్యంలోనే గత నెలలోనే ఐటీడీఏ పీవోలతో సమావేశం నిర్వహించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వర్షాకాలంలో గిరిజన ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, వైరల్ జ్వరాలు, డయేరియా వంటి సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు ముందస్తు చర్యలు చేపట్టామన్నారు. కొత్తగూడెం జిల్లాలోని ప్రతి మండలానికి ఒక అంబులెన్స్ మంజూరు చేశామన్నారు. సీహెచ్సీలు, ఏరియా హాస్పిటల్స్‌కు అనుబంధంగా అంబులెన్స్‌లను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. జిల్లాలో ఇప్పటి 7 దయాలసిస్ సెంటర్లు ఉండగా, కొత్తగా మరో 4 దయాలసిస్ సెంటర్లు మంజూరు చేసిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. వలం 20 నిమిషాల ప్రయాణంతో పేషెంట్ దయాలసిస్ సెంటర్‌కు చేరుకునేలా దయాలసిస్ నెట్‌వర్క్‌ను విస్తరించామని తెలిపారు. భద్రాచలం, అశ్వరావుపేట, ఎల్లందు సహా ఏజెన్సీ ప్రాంతాల్లోని అన్ని ఏరియా హాస్పిటల్స్‌లో సీటీ స్కాన్ సేవలను దశలవారీగా అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి హామి ఇచ్చారు. ఎమ్మెల్యేలు కోరినట్టుగా కొత్తగూడెం సహా అటవీ ప్రాంతాల్లో ఉన్న అన్ని పీహెచ్‌సీల్లో జనరేటర్లు ఏర్పాటు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పట్వారిగూడెం, అన్నపెరటిపల్లి పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేస్తామని, గండుగులపల్లిలో కొత్త సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తామని మంత్రి హామి ఇచ్చారు. కొమురారం హాస్పిటల్‌ను అప్‌గ్రేడ్ చేయడంతో పాటు, ఎల్లందు హాస్పిటల్‌లో కొత్త ఐసీయూను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిలో ఎవరికైనా భద్రాచలం, అశ్వారావుపేట వంటి అటవీ ప్రాంతాల్లో పనిచేసేందుకు ఆసక్తి ఉంటే.. వారికి ఆయా హాస్పిటళ్లలోనే పోస్టింగ్స్ ఇవ్వాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి మంత్రి సూచించారు. అదే సమయంలో, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే డాక్టర్లు, సిబ్బంది కఠినంగా వ్యవహరించాలని హెల్త్ సెక్రటరీనిని మంత్రి ఆదేశించారు. కొత్తగూడెం ఎంసీహెచ్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్‌ను మానిటర్ చేసేందుకు ఒక డాక్టర్‌ను ప్రత్యేకంగా నియమించాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా హాస్పిటల్స్‌లో డాక్టర్లు, సిబ్బంది అటెండెన్స్ మానిటరింగ్ కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యేలకు మంత్రి వివరించారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యం పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి

- **ఎండల తీవ్రతకు పెరిగిన విద్యుత్ డిమాండ్**



ప్రజానావ, హైదరాబాద్ : హైదరాబాద్ : ఎండల ప్రభావంతో గ్రేటర్ హైదరాబాద్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా నమోదవుతోంది. అధిక ఉష్ణోగ్రతలతో ఏసీలు, లర్ల వాడకం పెరిగిందని విద్యుత్‌శాఖ అధికారులు చెబుతున్నారు. గతేడాది జూలై రెండు వారాల్లో రోజువారీ విద్యుత్ వినియోగం 61–71 మిలియన్ల యూనిట్ల ఉండగా, ఈ ఏడాది జూలై 11 తేది నాటికి 71–82 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం నమోదవు తోంది. నగరంలో సాధారణం కంటే 4–5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే వారం రోజుల్లో ఉష్ణోగ్రతలు మరో 2–3 డిగ్రీలు పెరిగే అవకాశాలుంటాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ జిల్లాలో సోమవారం గరిష్ఠంగా 36.7 డిగ్రీలు, కనిష్ఠం – 25.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో భానుడి భగ.. భగలకు నగరవాసులు అల్లాడిపోతున్నారు. వర్షాకాలం లోనూ వేసవి తరహాలో పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో నగరవాసులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో జిల్లాలో తీవ్ర వర్షాభా వ పరిస్థితులు నెలకొన్నాయి. జూన్ 1 నుంచి జూలై 13 వరకు హైదరాబాద్ జిల్లాలో సాధారణంగా 175 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 100.1 మిల్లిమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. ఇది సాధారణం కంటే 43 శాతం తక్కువని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో సాధారణం కంటే 26 శాతం, మేడ్చల్– మల్కాజిగిరిలో 54 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా 28 తక్కువ వర్షపాతం ఈ సీజన్‌లో నమోదైంది. మరో వారం రోజులు భారీ వర్ష సూచనలు కన్పించడం లేదని బేగంపేట సీనియర్ వాతావరణశాఖ అధికారి జీఎన్‌ఆర్ఎస్ శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం సాధారణం కంటే 3–4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నగరంలో నమోదవుతున్నాయి. మరో 2–3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది.

ఆషాఢ బోనాలకు భారీగా ఏర్పాట్లు

- **నగర పోలీస్ అధికారులతో సజ్జనార్ సమీక్ష**

ప్రజానావ, హైదరాబాద్ : హైదరాబాద్ : ఆషాఢ బోనాల ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా నిర్వహించడమే లక్ష్యమని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్పష్టం చేశారు. ఈ బోనాలు.. మొదటి 15 రోజులు అత్యంత కీలకమని తెలిపారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆయన ఆదేశించారు. మంగళవారం బంజారా హిల్స్‌లోని టీజీఐసీసీసీలో ఆషాఢ బోనాలపై ఆ శాఖ అధికారులతో సజ్జనార్ సమీక్ష నిర్వహించారు. ఈ బోనాలకు పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జూలై 16 నుంచి ఆగస్టు13వ తేదీ వరకు ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోల్కొండ, బల్కంపేట, ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ ఆలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. భక్తులకు సమాచారం కోసం ఆలయాల వద్ద పబ్లిక్ అడ్రస్ సిస్టవ్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ వివరించారు. మహిళా భక్తుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని.. అందుకోసం షీ టీమ్స్‌తో నిరంతర నిఘా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈవ్ టీజింగ్, గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబుదొంగలపై ఉక్కుపాదం మోపనున్నట్లు చెప్పారు. గత బోనాల్లో 644 మంది ఆకతాయిలను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నామని ఆయన గుర్తు చేశారు. బోనాల ఊరేగింపులు, పోతురాజుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపులకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని వివరించారు.

ప్రజా జీవితంలో ముద్రగడ పాత్ర చిరస్మరణీయం

సంతాపం ప్రకటించిన సీఎం రేవంత్ తదితరులు

ప్రజానావ, హైదరాబాద్ : హైదరాబాద్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, లోక్ సభ మాజీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం గారి ఆకస్మిక మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. శాసనసభ్యుడిగా, లోక్ సభ సభ్యుడిగానే కాకుండా ప్రజా నాయకుడిగా సమస్యల పరిష్కారం లో ముందుండి పోరాడారని కొనియాడారు . మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు. ప్రజా జీవితంలో ముద్రగడ పద్మనాభం పోషించిన పాత్ర చిరస్మరణీ యమని, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. దేశంలో ఎంతో ప్రభావం చూపించిన విలక్షణ నాయకత్వ లక్షణాలు ఉన్న గొప్ప నాయకులు ముద్రగడ అని అన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా ఆయన ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ తనదైన ముద్ర వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని అన్నారు. వారి ఆత్మకు శాంతి చేరాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను' అని సంతాపం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ఇందిరమ్మ ఇండ్ల హవా

ఎక్స్ వేదికగా మంత్రి పొంగులేటి

ప్రజానావ, హైదరాబాద్ : ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయిన రోజు నుంచి గృహ ప్రవేశం వరకు తమ ఆనందాన్ని, అనుభవాలను అనేక మంది లబ్దిదారులు యూట్యూబ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా పంచుకోవడం ఎంతో సంతోషంగా ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. తొలిదశలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు, రెండో దశలో 2.5 లక్షల ఇండ్లు.. మూడో దశ, నాలుగో దశ, ఐదో దశ.. ఇలా ప్రతి పేదవాడి సొంతింటి కలను ఇందిరమ్మ ఇండ్ల రూపంలో సాకారం చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేదల చిరునవ్వులే మా ప్రభుత్వానికి గొప్ప పురస్కారాలని పేర్కొన్నారు. గతంలో లాగా మభ్య పెట్టే కార్యక్రమంగా కాకుండా పేదలకు ఇళ్లను నిర్మించి ఇస్తున్నామని, అందుకు వీడియోలే సాక్ష్యమనితెలిపారు.

అక్రమాస్తుల గుట్టురట్టు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. మార్కెట్ విలువ ఆధారంగా ఈ మొత్తం మరింత పెరిగే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. గుర్తించిన ఆస్తులతో పాటు మరికొన్ని చర, స్థిరాస్తులు, ఆర్థిక లావాదే వీలపై కూడా లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. బినామీ ఆస్తులు, పెట్టుబడు లు, ఇతర ఆర్థిక లావాదేవీల కోణంలోనూ విచారణ కొనసాగుతున్నట్లు తెలిపింది. దర్యాప్తు పూర్త యిన అనంతరం చట్టపరమైన చర్యలు చేపడతా మని అధికారులు వెల్లడించారు.

ఏసీబీ వలలో పెద్దపల్లి మున్సిపల్ ఏఈ

పెద్దపల్లి జిల్లా మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ ఇంజినీర్ రూ.2 లక్షల లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. శ్మశానవాటిక అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.12.28 లక్షల తుది బిల్లును ప్రాసెస్ చేసి ఉన్నతాధికారులకు పంపిస్తానంటూ ఫిర్యాదుదారుడి నుంచి రూ.2 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది. బాధితుడి ఫిర్యాదుతో ఉచ్చు వేసిన అధికారులు లంచం స్వీకరిస్తున్న సమయంలో నిందితుడిని పట్టుకున్నారు. అనంతరం నిందితుడి నివాసంలో నిర్వహించిన సోదాల్లో రూ.32.31 లక్షల లెక్కల్లో చూపని నగదు లభించినట్లు ఏసీబీ వెల్లడించింది. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసిన అధికారులు, స్వాధీనం చేసుకున్న నగదు మూలాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

'రూట్ ' క్లియర్ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

తగ్గుతుందని తెలిపారు. దీంతో హైదరాబాద్ నుంచి బందరు పోర్టుకు సరకు రవాణా మరింత వేగవంతమవుతుందని వివరించారు. అలాగే మన్ననూరు–శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు అవసరమైన అటవీ శాఖ అనుమతులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఈ మార్గం నల్లమల అభయారణ్యం, శ్రీశైలం ఆలయం, శ్రీశైలం జలాశయం పరిధిలో ఉండటంతో ప్రాజెక్టుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని తెలిపారు. పర్యాటకం, రవాణా రంగాల అభివృద్ధికి ఈ కారిడార్ దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా మంచిర్యాల నుంచి హైదరాబాద్ వరకు ఆరు వరుసల రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. కొత్త రహదారుల అభివృద్ధితో వ్యవసాయం, పరిశ్రమలు, వాణిజ్య రంగాల్లో మరిన్ని అవకాశాలు ఏర్పడి తెలంగాణ ఆర్థిక ప్రగతికి మరింత ఊతం లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రత్యేక కార్యదర్శి (కోఆర్డినేషన్) అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

హర్మూజ్‌లో మళ్లీ మంటలు

(మొదటిపేజీ తరువాయి)

మరింత ఉద్రిక్తంగా మారడంతో బహ్రెయిన్, కువైట్, ఖతర్, యూఏఈ, ఒమాన్ గగనతలంలో విమానాల రాకపోకల విషయంలో అప్రమత్తంగా ఉండాలని యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ విమానయాన సంస్థలకు సూచించింది. ఇదిలాఉంటే అమెరికా–ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక శాంతి ఒప్పందం తాజా పరిణామాలతో సంక్షోభంలో పడింది. ఇరాన్‌పై సముద్ర దిగ్బంధనాన్ని మళ్లీ అమలు చేస్తామని అమెరికా ప్రకటించింది. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ ముడి చమురు ధరలు ఒక్కసారిగా పెరిగినా, ట్రంప్ టోల్ ఫీజు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంతో కొంత తగ్గాయి. అయినప్పటికీ ప్రపంచ ఇంధన సరఫరా, సముద్ర వాణిజ్యంపై అనిశ్చితి కొనసాగుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

సర్ గడువు పొడిగించండి

(మొదటిపేజీ తరువాయి)

ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ఈ నెల 24తో ఇంటింటి సర్వే ముగియనున్న నేపథ్యంలో ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, జీహెచ్ఎంసీ సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. దీంతో సర్వే వేగంగా పూర్తవడంతో పాటు అర్హత కలిగిన ప్రతి ఓటర్‌కి అవకాశం కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు. ఇదిలాఉంటే.. రాష్ట్ర ఎన్నికల కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో సర్ ప్రక్రియలో భాగంగా మంగళవారం సాయంత్రం నాటికి 99.99 శాతం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినట్లు వెల్లడించింది. ఇప్పటివరకు 49.28 శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపింది. ఓటర్లు నింపిన ఎన్యుమరేషన్ ఫారాలను వీలైనంత త్వరగా బీఎల్వోలకు అందజేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సీఈసీ సుదర్శన్‌రెడ్డి సూచించారు.

తెలంగాణ తెలుగు అకాడమీ

నూతన డైరెక్టర్‌గా ఆచార్య భట్టు రమేష్ నియామకం

ప్రజానావ, హైదరాబాద్: ప్రతిష్టాత్మక తెలంగాణ తెలుగు అకాడమీ నూతన డైరెక్టర్‌గా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్, సీనియర్ అధ్యాపకులు ఆచార్య భట్టు రమేష్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు భాషా పరిరక్షణ, పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక భూమిక పోషించే తెలుగు అకాడమీ సారథ్య బాధ్యతలను ఆచార్య భట్టు రమేష్ కు అప్పగించడం పట్ల పలువురు విద్యావేత్తలు ఆచార్యులు పరిశోధకులు గిరిజన సంఘాల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆచార్య భట్టు రమేష్ కు ఉన్నత విద్యారంగంలో మూడు దశాబ్దాలకు పైగా బోధనానుభవం ఉంది. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అత్యుత్తమ సేవలందించారు. ఆయన పర్యవేక్షణలో పలువురు పరిశోధకులు ఎంఫిల్, పిహెచ్.డి పట్టాలను అందుకున్నారు.

రష్యాపై ఆంక్షల బిల్లు

- **అమెరికా సెనేట్‌లో ఊపందుకున్న ప్రయత్నాలు**
- **లిండ్సే గ్రాహమ్ ఆశయానికి రూపమిచ్చే దిశగా అడుగులు**
- **రష్యా చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాల ప్రతిపాదన**
- **చైనా, భారత్‌పైనా తీవ్ర ప్రభావం**

వాషింగ్టన్: రష్యాపై మరింత కఠిన ఆర్థిక ఆంక్షలు విధించే లక్ష్యంతో రూపొందించిన సవరించిన బిల్లుకు అమెరికా సెనేట్‌లో వేగం పెరిగింది. దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహమ్ అత్యంత ప్రాధాన్యంగా భావించిన ఈ బిల్లును మంగళవారం సెనేట్‌లో ప్రవేశపెట్టారు. రష్యా నుంచి చమురు, సహజవాయువు వంటి ఇంధన ఉత్పత్తులను అధికంగా కొనుగోలు చేస్తున్న దేశాలపై ఆర్థిక ఒత్తిడి పెంచి, ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు అందుతున్న ఆదాయ వనరులను తగ్గించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశమని బిల్లు రూపకర్తలు తెలిపారు. మొదట ప్రతిపాదించిన ముసాయిదాలో రష్యా నుంచి దిగుమతులు చేసుకునే అన్ని దేశాలపై 500 శాతం వరకు సుంకాలు విధించాలని సూచించారు. అయితే మిత్రదేశాలపై కూడా తీవ్ర ప్రభావం పడే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని బిల్లులో మార్పులు చేశారు. తాజా ప్రతిపాదన ప్రకారం రష్యా చమురు, సహజవాయువును అత్యధికంగా కొనుగోలు చేసే తొలి ఐదు దేశాలపై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశం ఉంటుంది. ఈ జాబితాలో చైనా, భారత్ కూడా ఉన్నట్లు బిల్లు రూపకర్తలు పేర్కొన్నారు. అదే సమయంలో రష్యాపై ఇంధన ఆధారాన్ని క్రమంగా తగ్గిస్తున్న కొన్ని దేశాలకు మినహాయింపులు కల్పించే నిబంధనను కూడా చేర్చారు.

గ్రాహమ్‌కు నివాళిగా బిల్లు

ఈ బిల్లుకు లిండ్సే గ్రాహమ్ పేరును పెట్టాలని డెమొక్రాటిక్ పార్టీ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటాల్ ప్రతిపాదించారు. రష్యాపై కఠిన వైఖరి అవలంబించడంలో గ్రాహమ్ కీలక పాత్ర పోషించారని, ఈ బిల్లు ఆయన రాజకీయ వారసత్వంలో ముఖ్యమైన ఘట్టంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. సెనేట్ డెమొక్రాటిక్ పార్టీ నేత చక్ షుమర్ ఈ బిల్లును త్వరగా సభ ముందుకు తీసుకురావాలని కోరగా, మెజారిటీ నాయకుడు జాన్ థూన్ కూడా దానికి సహకరిస్తామని తెలిపారు. ఇప్పటికే రెండు డజన్లకు పైగా సెనేటర్లు మద్దతు ప్రకటించగా, మరికొందరు సభ్యులు కూడా బిల్లుకు మద్దతు తెలిపే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. రష్యాపై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచి, ఉక్రెయిన్‌కు భద్రతా, పునర్నిర్మాణ సహాయాన్ని బలోపేతం చేయడంలో ఈ బిల్లు కీలక పాత్ర పోషిస్తుందని విశ్లేషకులు అభిప్రాయప డుతున్నారు. ఇటీవల అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ఈ బిల్లుపై చర్చలు జరిపిన అనంతరం లిండ్సే గ్రాహమ్ దీనికి వైట్‌హౌస్ మద్దతు లభించే అవకాశాలపై ఆశాభావం వ్యక్తం చేసినట్లు ఆయన సహచరులు వెల్లడించారు.

ఆకాశమే హద్దుగా..

- **అంతర్జాతీయ ప్రమాణాలతో మామునూరు, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేయాలి**
- **ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలతో ఏరో హబ్‌లుగా తీర్చిదిద్దాలి**
- **పౌర విమానయాన మంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ**
- **పనుల పురోగతి, డిజైన్లు, భవిష్యత్ అవసరాలపై చర్చ**

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాలను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. రెండు విమానాశ్రయాలను కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం చేయకుండా.. మెయింటెనెన్స్, రిపేర్స్, ఓవర్‌హాలింగ్ (ఎంఆర్‌వో), ఎయిర్‌కార్గో, హ్యాంగర్ వంటి ఆధునిక సదుపాయాలతో ఏరోస్పేస్ కేంద్రాలుగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయంలో మంగళవారం కేంద్ర మంత్రితో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల అభివృద్ధి, పనుల పురోగతి, డిజైన్లు, భవిష్యత్ అవసరాలపై సుదీర్ఘంగా చర్చించారు. వరంగల్ నగరం భవిష్యత్తులో కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి వివరించారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీతో పాటు పలు పరిశ్రమలు, వ్యాపార కార్యకలాపాలకు వరంగల్ కేంద్రంగా మారుతోందన్నారు. ఉత్తర తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు వరంగల్ నగరం కీలక అనుసంధాన కేంద్రంగా ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో మామునూరు విమానాశ్రయాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. భూసేకరణ ప్రక్రియ పూర్తయినందున వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సీఎం కోరారు. 2028 జూన్ 2 నాటికి విమానాశ్రయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన వరంగల్ విమానాశ్రయ డిజైన్ కాకతీయ సంస్కృతి, వారసత్వానికి అద్దం పట్టేలా రూపొందించాలని సీఎం సూచించారు. దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు ప్రాధాన్యం

ఆదిలాబాద్‌లో రక్షణ శాఖ ఆధీనంలోని ఎయిర్‌ఫీల్డ్‌తో పాటు పౌర విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయాలని సీఎం కోరారు. రెండు విమానాశ్రయాలకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. వరంగల్ తరహాలోనే ఆదిలాబాద్ విమానాశ్రయంలోనూ ఎంఆర్‌వో, ఎయిర్‌కార్గో, హ్యాంగర్ సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే రెండు ప్రాంతాల్లో విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే హుస్సేన్‌సాగర్ నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు సీ ప్లేన్ సేవల అవకాశాలను పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు పంపించాలని కేంద్ర మంత్రి సూచించారు. సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలకు రాజకీయాలను ముడిపెట్టకూడదన్నారు. రాజకీయాలను ఎన్నికల సమయానికే పరిమితం చేయాలని సూచించారు. విమానాశ్రయాల అభివృద్ధి ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం కేంద్ర మంత్రులను కలవడాన్ని రాజకీయంగా చూడడం సరికాదన్నారు.

భూసేకరణపై కేంద్ర మంత్రి ప్రశంస

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో విమానాశ్రయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం వేగంగా భూసేకరణ పూర్తి చేసి విమానాశ్రయాల అభివృద్ధికి ముందడుగు వేసిందని ప్రశంసించారు. వరంగల్ విమానాశ్రయ డిజైన్‌లో కాకతీయ సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో నల్గొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, పౌర విమానయాన శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

భారత నావికుల భద్రతకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్

(మొదటిపేజీ తరువాయి)

జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీఎస్)ను ఆదేశించారు. నౌక స్థానం, యాజమాన్యం, సరుకు, సిబ్బంది సంఖ్య, భద్రతా పరిస్థితులు, ప్రయాణ మార్గం, తదుపరి పోర్టు, అత్యవసర సదుపాయాల వంటి వివరాలు డ్యాష్‌బోర్డ్‌లో అందుబాటులో ఉంటాయి. ప్రభావిత ప్రాంతంలోని ప్రతి భారతీయ నావికుడికి ప్రత్యేక లియాజన్ అధికారిని నియమించి, వారి కుటుంబాలకు నిరంతర సమాచారం, వైద్య సహాయం, స్వదేశానికి తరలింపు, బీమా, వేతనాలు, పరిహారం తదితర అంశాల్లో సమన్వయం చేయాలని మంత్రి ఆదేశించారు.

దాడుల నేపథ్యంలో అత్యవసర సమీక్ష

హర్మూజ్ జలసంధిలో ఎంటీ అల్ బహియాహ్, ఎంటీ మొంబాసా నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు మృతి చెందగా, పలువురు గాయపడిన నేపథ్యంలో కేంద్రం అత్యున్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించింది. విదేశాంగ శాఖ, భారత నౌకాదళం, పెట్రోలియం, రసాయన ఎరువుల శాఖలు, ఇరాన్, ఒమన్‌లలోని భారత రాయబార కార్యాలయాలతో కలిసి సమన్వయం పెంచాలని సోనోవాల్ ఆదేశించారు. భారతీయ నావికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసిన మంత్రి, ప్రమాద ప్రాంతాల్లో ప్రయాణించే ప్రతి నౌక తాజా భద్రతా అంచనాల అనంతరమే ప్రయాణం కొనసాగించాలని సూచించారు. అలాగే నౌక యజమానులు, నిర్వహణ సంస్థలు, నియామక ఏజెన్సీలు భారతీయ నావికుల భద్రతకు తీసుకుం టున్న చర్యలపై వెంటనే నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

కేసుల దర్యాప్తు వేగవంతం చేసి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ మహేష్ బీ.గితే
- సిరిసిల్ల సబ్ డివిజన్ పోలీస్ అధికారుల సమీక్షా సమావేశం

ప్రజానావ, సిరిసిల్ల : ప్రతి కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, శాస్త్రీయ ఆధారాలతో నాణ్యమైన విచారణ చేపట్టి నిందితులకు శిక్షలు పడేలా ప్రతి అధికారి కృషి చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సిరిసిల్ల సబ్‌డివిజన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నిందితుల అరెస్టులు, నాన్–బెయిలబుల్ వారెంట్ల అమలు, శాంతిభద్రతల నిర్వహణ, పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో శాస్త్రీయ,సాంకేతిక ఆధారాలు, ఫోరెన్సిక్ సాక్ష్యాలు, డిజిటల్ ఎవిడెన్స్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. నాణ్యమైన దర్యాప్తు ద్వారానే కోర్టుల్లో నిందితులకు శిక్షలు పడతాయని, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరుగుతుందని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి, చట్టపరిధిలో బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. పెట్రోలింగ్ సమయంలో అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్లను మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా తప్పనిసరిగా తనిఖీ చేసి నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడంతో పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతికతను వినియోగిస్తూ నేరాలను వేగంగా ఛేదించి బాధితులకు సత్వర న్యాయం అందించాలన్నారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలు అయిన గంజాయి,గుడుంబా, పేకాట,పిడిఎస్ రైస్,అక్రమ ఇసుక రవాణా వంటి వాటిపై ప్రత్యేక నిఘా ఉంచి దాడులు నిర్వహించి వాటికి అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీలు నాగేంద్రచారి, వెంకటేశ్వర్లు, సీఐలు శ్రీనివాస్, నాగేశ్వరరావు, వెంకటేష్, మొగిలి, మధుకర్, ఆర్ఐ సురేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సోటెఫిన్ భారత్ ఎస్ఎంఈ ఐపీఓకు రంగం సిద్ధం

- రేపటి నుంచి ఈ నెల 20 వరకు సబ్‌స్క్రిప్షన్
- ఒక్కో షేరు ధర రూ.178–187గా నిర్ణయం
- రూ.89.76 కోట్ల సమీకరణే లక్ష్యం

న్యూఢిల్లీ: రోబోటిక్, ఆటోమేటెడ్ పార్కింగ్ సొల్యూషన్స్ సంస్థ సోటెఫిన్ భారత్ లిమిటెడ్ ఎస్ఎంఈ ఐపీఓకు ధరల శ్రేణిని ప్రకటించింది. ఒక్కో షేరు ధరను రూ.178 నుంచి రూ.187గా నిర్ణయించినట్లు కంపెనీ మంగళవారం వెల్లడించింది. మొత్తం రూ.89.76 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఈ పబ్లిక్ ఇష్యూ చేపడుతోంది. సోటెఫిన్ భారత్ ఐపీఓ జూలై 16న ప్రారంభమై జూలై 20న ముగియనుంది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం బిడ్డింగ్ ప్రక్రియ జూలై 15న ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. ఈ ఐపీఓ పూర్తిగా కొత్త షేర్ల జారీ (ఫ్రెష్ ఇష్యూ) రూపంలో ఉండనుంది. మొత్తం 48 లక్షల ఈక్విటీ షేర్లను విడుదల చేయనున్నారు. ఐపీఓ ద్వారా సమీకరించే నిధులను కోల్‌కతా, పశ్చిమ బెంగాల్‌లో తయారీ కేంద్రం ఏర్పాటు, కొత్త కార్యాలయ భవనం, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనున్నట్లు సంస్థ తెలిపింది. 2012లో ప్రారంభమైన సోటెఫిన్ భారత్ ఆటోమేటెడ్ పార్కింగ్ వ్యవస్థల రూపకల్పన, తయారీ, ఏర్పాటు, నిర్వహణ సేవలను అందిస్తోంది.

భాష విద్యార్థికి సులభంగా అర్థం కావాలి

- నిత్య జీవితంలో ఆ పదాలు వినియోగించేలా సామర్థ్యాలు మెరుగు పడాలి
- పిల్లలు ఆసక్తితో బడికి వచ్చేలా బోధించాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సిరిసిల్లలోని వెంకంపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని విన్న జిల్లా కలెక్టర్

ప్రజానావ, సిరిసిల్ల : తరగతి గదిలోని ప్రతి విద్యార్థికి సులభంగా అర్థం అయ్యేలా ఉపాధ్యాయులు భాషను బోధించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ లో భాగంగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని వెంకంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ శిక్షణ ఇస్తుండగా, మంగళవారం ఉపాధ్యాయులతో కలిసి కూర్చుని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విన్నారు. ప్రతి సారి బోధించే ఉపాధ్యాయులు విద్యార్థుల స్థానంలో కూర్చుని పాఠాలు వినడం, వారి అనుభవాలను, శిక్షణ ప్రక్రియపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అలాగే ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గీతా నగర్ సిరిసిల్ల, ఇంగ్లీష్ ఉపాధ్యాయులకు శిక్షణ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేములవాడ, ప్రాథమిక స్థాయి ఎంఆర్ పీలకు తెలుగు, ఇంగ్లీష్, మ్యాథ్స్ అంశాల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేటలో శిక్షణ కొనసాగుతున్నది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయులకు అందించే ఇన్ సర్వీస్ టీచర్ ట్రైనింగ్ ఎంతో మేలు చేకూరుస్తుందని తెలిపారు. శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశం రోజు వారి బోధనలో ఉపయోగించాలని సూచించారు. విద్యార్థి కేంద్రీకృత, వివిధ రంగులు ఉపయోగిస్తూ.. కృత్యదార బోధన చేయాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఇంగ్లీష్, హిందీ పదాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని ఆదేశించారు. రోజు వారి జీవితంలో భాగంగా వినియోగించే పదాలు, అంకెలు, పండ్లు, ఇతర విషయాలు సులభంగా నేర్చుకునేలా బోధించాలని తెలిపారు. బోధనలో టీఎల్ఎంలు వినియోగించి.. విద్యార్థులు ఆసక్తితో బడికి వచ్చేలా వివరించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్, మ్యాథ్స్ ఇతర అంశాల్లో కనీస అభ్యాసన సామర్థ్యాలు మెరుగు అయ్యేలా తీర్చిదిద్దాలని పిలుపు నిచ్చారు. ఉపాధ్యాయులందరూ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని తరగతి గదిలో అమలు చేయాలని, మంచి ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి మొండయ్య, తహసీల్దార్ మహేష్, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాబా అవతారంలో హంతక్ రౌడీషీటర్

వలపన్ని పట్టుకున్న పోలీసులు

ప్రజానావ, హైదరాబాద్ : హత్య కేసు నుంచి తప్పించుకునేందుకు బాబా అవతారం ఎత్తిన రౌడీషీటర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. మహ్మద్ జావేద్ అనే వ్యక్తి 2018లో జరిగిన మర్డర్ సులో నిందితుడిగా ఉన్నాడు. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని రౌడీషీటర్ హత్య చేశాడు. ఆపై పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నాడు. హత్యపై కేసు నమోదు చేసిన పోలీసులు.. 2020 ఆగస్టులో జావేద్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేశారు. అప్పటి నుంచి జావేద్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, పోలీసుల కళ్లుగప్పి సంగారెడ్డి జిల్లా చేర్యాలలో బాబా అవతారం ఎత్తాడు రౌడీ షీటర్. ఓ దర్గాలో బాబాగా రౌడీషీటర్ చలామణి అవుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారంతో ఖైరతాబాద్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని చాకచక్యంగా జావేద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆపై అతడికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. గంజా సేవించినట్లు నిర్ధారించారు. మరోవైపు రౌడీషీటర్ వద్ద భారీగా గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కలెక్టరేట్ జంక్షన్ వద్ద ప్రమాదాల నివారణకు కసరత్తు

- వివిధ శాఖల అధికారులతో స్థల పరిశీలన
- చర్యలకై పలు సూచనలు, ప్రతిపాదనలు

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల కలెక్టరేట్ కూడలి రగుడు రౌండబౌట్ జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదాలపై వివిధ శాఖల అధికారులు చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణ పై కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు మంగళవారం స్థల పరిశీలన చేసి చర్యలకై పలు నిర్ణయాలు ప్రతిపాదించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జిల్లా రవాణా శాఖ, రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ శాఖ, ట్రాఫిక్ పోలీసు శాఖ, అధికారులు సంయుక్తంగా స్థల పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణా శాఖ అధికారి, డీఈ (ఆర్ అండ్ బీ), ఆర్టీఏ మెంబర్, మున్సిపల్ కమిషనర్, ట్రాఫిక్ ఎస్ఐ, సంబంధిత అధికారులు జంక్షన్‌ను క్షుణ్ణంగా పరిశీలించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ప్రమాదాలను తగ్గించేందుకు చర్యలను వెంటనే చేపట్టాలని సంబంధిత శాఖలకు సూచించారు. రౌండబౌట్‌కు ముందు అన్ని దిశల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం, స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక బోర్డులు, దిశా సూచిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు ఏర్పాటు చేయడం, రాత్రి సమయంలో వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా తగిన వీధి విద్యుత్ దీపాలు (స్ట్రీట్ లైటింగ్) ఏర్పాటు చేయడం, రౌండబౌట్‌ను ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి రిఫ్లెక్టివ్ మార్కింగ్‌లు, క్యాట్ ఐస్ ఏర్పాటు చేయడం, రహదారిపై థర్మోప్లాస్టిక్ రోడ్ మార్కింగ్‌లు, స్టాప్ లైన్లు, జీబ్రా క్రాసింగ్‌లు అవసరమైన చోట వేయడం, జంక్షన్ వద్ద పొదలు, అడ్డంకులను తొలగించి దృశ్యమానత (విసిబిలిటీ) మెరుగుపరచడం, అవసరమైతే స్పీడ్ కాల్మింగ్ చర్యలు చేపట్టి అధిక వేగాన్ని నియంత్రించడం, ట్రాఫిక్ రద్దీ సమయాల్లో పోలీసు శాఖ ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించడం, భారీ వాహనాలు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అవగాహన కల్పించడం మొదలైన సూచనలను చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాహనదారులకు విజ్ఞప్తి చేస్తూ, అధిక వేగంతో ప్రయాణించకుండా, ట్రాఫిక్ సూచికలను తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్ట్ వినియోగించాలని సూచించారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

కేపీహెచ్‌బీ లులూ మాల్ వద్ద ఘర్షణ

- గన్‌తో వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆందోళన
- మాల్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు

ప్రజానావ, హైదరాబాద్ : పీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లులు మాల్‌లో ఓ వ్యక్తి గన్‌తో కనిపించడం కలకలం రేపింది. మాల్ పార్కింగ్ వద్ద రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెబుతుండగా పాతబస్తీకి చెందిన సిద్దిఖీ అనే వ్యక్తి జేబులో గన్‌ను పోలీసులు గుర్తించారు. సిద్దిఖీ దగ్గర గన్ కనిపించడంతో అప్రమత్తమైన పోలీసులు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కాగా గన్‌కు చెల్లుబాటయ్యే లైసెన్స్ ఉన్నట్లు తేలింది. అయితే గన్‌తో వచ్చిన వ్యక్తిని మాల్‌లోకి అనుమతించడంలో భద్రతా సిబ్బంది నిర్లక్ష్యంపై పోలీసులు సీరియస్ అయ్యారు. మాల్‌లోకి ప్రవేశించేప్పుడు సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే సదరు వ్యక్తి గన్‌తో లోపలికి రాగలిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లులు మాల్ యాజమాన్యంపై సు నమోదు చేశారు. మాల్ ప్రవేశ ద్వారం వద్ద భద్రతా సిబ్బంది సరైన తనిఖీలు నిర్వహించకపోవడం వల్లే గన్‌తో సదరు వ్యక్తి లోపలికి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. సాధారణంగా మాల్స్‌లో మెటల్ డిటెక్టర్లు, బ్యాగ్ స్కానింగ్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలు చేయాల్సి ఉంది. కానీ ఈ ఘటనలో భద్రతపరంగా నిర్లక్ష్యం జరిగింది. నేపథ్యంలో భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నందుకు లులు మాల్ యాజమాన్యంపై పోలీసులు సు నమోదు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులు సూచించారు. ఈ ఘటన నగరంలోని ప్రముఖ షాపింగ్ మాల్స్‌లో భద్రతా ఏర్పాట్లపై మరోసారి చర్చకు దారితీసింది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని మాల్స్‌లో భద్రతా తనిఖీలను ఖచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

రక్తం చిందిస్తే వానలు పడతాయన్న వ్యాఖ్యలు బాధాకరం

- సీఎం రేవంత్‌రెడ్డిపై వెంటనే కేసు పెట్టాలి
- డీజీపీని కోరిన బీఆర్ఎస్ నేత ప్రవీణ్ కుమార్

ప్రజానావ, హైదరాబాద్ : రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయని, పంటలు పండుతాయని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. ఆయనపై వెంటనే సు నమోదు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. మన పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఏమాత్రం ప్రొఫెషనలిజం మిగిలి ఉన్నా వెంటనే సుమోటోగా స్వీకరించి, రేవంత్ రెడ్డిపై సు నమోదు చేయమని పోలీసులకు ఆదేశించాలని కోరారు. పరిస్థితి చేయి దాటకముందే నివారించాలని విజ్ఞప్తి చేశారు.సు నమోదు చేయడంపై చట్టంలో ఎక్కడా ముఖ్యమంత్రికి మినహాయింపు ఇవ్వలేదని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రిని అరెస్టు చేయాలంటే వలం అసెంబ్లీ స్పీకర్‌కు మాత్రమే సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇది రాజకీయ కక్షతో చేస్తున్న ఆరోపణ కానే కాదని స్పష్టం చేశారు. రక్తం చిందిస్తే వానలు బాగా వస్తాయి, పంటలు బాగా పండుతాయని ఏకంగా సీఎం సలహా ఇచ్చారని, ఎవరైనా ఆగంతకుడు పంట పొలాల్లో నిద్రిస్తున్న అమాయక రైతులను చంపి షాబాద్ రాజ్‌కుమార్‌లా వీడియోలు తీస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావుపై ఎవరై, మిగతా అగ్ర నాయకులపై ఆగంతకులు చేస్తే పరిస్థితి ఏంటని అడిగారు. ముఖ్యమంత్రే బెల్ట్‌తో కొట్టమన్నారని చెప్పి.. భర్తలు తాగొచ్చి భార్యాపిల్లలను బెల్ట్‌లతో కొడితే, కింది ఉద్యోగులను పై అధికారులు బెల్ట్‌తో కొడితే పరిస్తఇతి ఏంటని ప్రశ్నించారు.దీనిపై ఒకసారి ల్గా ఆలోచించాలని సూచించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకుల పూద పెట్రోల్ పోసి, తాను డా పోసుకుంటానని గతంలో గజ్వేల్‌లో నిర్వహించిన ఓ బహిరంగ సభలో కార్యకర్తలను మైనంపల్లి హన్మంతరావు ప్రేరేపించారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కనీసం ఆయన పూద డా సు నమోదు చేయకుండా, పీపీ ఒపీనియన్ తీసుకుని ఇది సివిల్ సు అని నాటి సిద్దిపేట పోలీస్ కమిషనర్ చెప్పారని గుర్తుచేశారు. దీన్ని ప్రజలు మరిచిపోయారని అన్నారు. సంగారెడ్డిలో శౌర్య పతాక విజేత ఇన్‌స్పెక్టర్ శివకుమార్ యాదవ్ అంతు చూస్తానన్న జగ్గారెడ్డికి కనీసం నోటీసులు అయినా ఇచ్చారా అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పోస్టింగ్‌లు ఇవాళ ఉంటాయి.. రేపు పోతాయి.. కానీ పోలీసు వ్యవస్థ శాశ్వతమని తెలిపారు. పోలీస్ వ్యవస్థ ప్రతిష్ట గురించి, ప్రజలకు జీవించే హక్కు (ఆర్టికల్ 21) గురించి ఆలోచించాలని డీజీపీకి సూచించారు. మంచి పనులు చేస్తే చరిత్రలో మిగిలిపోతారని, రాజ్యాంగంలోని 311 అధికరణం మిమ్మల్ని కాపాడుతుందని తెలిపారు. ఆయన వివరణతో సంతృప్తి చెందకపోతే సు నమోదు చేయాలన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయాలని డీజీపీకి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు. ఈ రక్తపు భాష ఆగకపోతే రాష్ట్రంలో రక్తపాతం జరిగే ప్రమాదం ఉందని, వేలాది మంది అమాయకులు బలైపోతారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఎంపిక

కేంద్ర మంత్రి మన్సూఖ్ మాండవియాకు మంత్రుల కృతజ్ఞతలు

ప్రజానావ, హైదరాబాద్ : 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ఎంపిక చేసినందుకుగాను ంద్ర యువజన వ్యవహారాలు / క్రీడల శాఖ మంత్రి మన్సుక్ మాండవియాను రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలు కలిసి ధన్యవాదములు తెలిపారు. 2026లో నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణను ప్రకటించిన అనంతరం హైదరాబాద్ కు వచ్చిన ంద్రమంత్రి మన్సుక్ మాండవియను మంత్రి వాకిటి శ్రీహరి కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ంద్రం ప్రోత్సాహంతో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను క్రీడారంగంలో అగ్రగామిగా నిలుపుతామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

పెద్దపల్లి జంక్షన్ మీదుగా నాందేడ్ - తిరుచానూరు ఎక్స్ ప్రెస్ రైలు

ప్రజానావ, పెద్దపల్లి : పెద్దపల్లి జంక్షన్ మీదుగా జూలై 21 నుండి ఆగష్టు 25 వరకు 07603 నాందేడ్ నుండి తిరుచానూరు వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు వారానికి ఒక రోజు చొప్పున ఆరు ట్రిప్ లు దిగువ మార్గంలో వయా వరంగల్ – విజయవాడ – గూడూరు మీదుగా నడుస్తుంది అదే విధంగా ఎగువ మార్గంలో 07604 తిరుచానూరు నుండి నాందేడ్ వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు జూలై 22 నుండి ఆగష్టు 26వ తేదీ వరకు వారానికి ఒక రోజు చొప్పున 6 ట్రిప్లు నడుస్తుంది, మొత్తంగా ఎగువ , దిగువ మార్గాల్లో నాందేడ్ నుండి తిరుచానూరు నుండి నాందేడ్ వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైళ్లు 12 ట్రిప్ లు నడుస్తాయి. ఇప్పటికే పెద్దపల్లి జంక్షన్ నుండి వయా వరంగల్ – విజయవాడ – గూడూరు మార్గంలో వారానికి 2 రోజులు 12762 కరీంనగర్ నుండి తిరుపతి సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ప్రతి ఆది, గురువారాల్లో నడుస్తుంది, 17635 నాందేడ్ నుండి ధర్మవరం వీక్లీ ఎక్స్ ప్రెస్ ప్రతి శుక్రవారం 17633 నాందేడ్ నుండి తిరుచానూరు వీక్లీ ఎక్స్ ప్రెస్ ప్రతి శనివారాల్లో నడుస్తున్నాయి, అదే విధంగా గురువారం రోజున 07814 జాల్నా నుండి తిరుపతి వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు నడుస్తుంది, తాజాగా మంగళవారం రోజున 07603 నాందేడ్ నుండి తిరుచానూరు వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు అందుబాటులోకి రావడంతో ఇక ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో ఇదే మార్గం గుండా వారానికి 5 రోజులు తిరుపతి కి రైలు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది, కేవలం సోమ, బుధ వారాల్లో మాత్రమే ఈ మార్గంలో తిరుపతి కి రైలు లేదు. నాందేడ్ నుండి తిరుచానూరు వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు పెద్దపల్లి జంక్షన్ కి ప్రతి మంగళ వారం రాత్రి 9 గంటలకు వచ్చి 9:30 నిమిషాలకు బయలుదేరుతుంది, అదేవిధంగా 07604 తిరుచానూరు నుండి నాందేడ్ వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు ప్రతి గురువారం రాత్రి (తెల్లవారు జామున) 01:50 నిమిషాలకు వచ్చి 02:15 నిమిషాలకు బయలుదేరుతుంది. ఈ రైలు సేవలను ప్రయాణికులు వినియోగించుకోగలరు. ఇప్పటికే ఇదే మార్గం గుండా నడిచే 07814/13 జాల్నా నుండి తిరుపతి నుండి జాల్నా వీక్లీ ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రైలు మంచి ఆదరణతో నడుస్తుంది, గతంలో ప్రత్యేక వీక్లీ ఎక్స్ ప్రెస్ రైళ్లుగా మంచి ఆదరణతో నడిచిన తిరుచానూరు, ధర్మవరం రైళ్ళను క్రమబద్ధీకరించారు

ఆక్వా పార్కులో నిర్వాసిత స్థానిక మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

- లేల్లెల బాలకృష్ణ మత్స్యకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిమాండ్

TMKMKS
TMKMKS
TMKMKS

ప్రజానావ, మంచిర్యాల : హాజీపూర్ మండలం నంన్నూర్ గ్రామంలో నిర్వాసిత మత్స్యకార గ్రామాల ప్రజలతో బోయిరి రాజకుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగినది. ఈ సమావేశానికి లేల్లెల బాలకృష్ణ తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మచ్చ సంపద యోజన పథకం ద్వారా 2026 –27 సంవత్సరం ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో సుమారు 100 కోట్ల రూపాయలతో 85 ఎకరాల స్థలంలో నిర్మాణం అవుతున్న ఆక్వా పార్క్ మత్స్య పరిశ్రమ చేపలు రొయ్యలు కొర్రమీను శుభ్రపరచడం ప్రాసెసింగ్ చేయడం విదేశాలకు విజ్ఞత చేసే పనులు మత్స్యకార యువత, మహిళలకు శిక్షణ సంస్థలు, భవన నిర్మాణం, ఫిష్ కోర్టులు, పర్యటక రంగం అభివృద్ధి పేరుతో స్థానిక స్వయం సహాయ బృందాలకు అవకాశాలు కల్పించడం చేస్తామన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో గుడి పేట, నంన్నూర్, రాపల్లి, కర్ణ మామిడి గ్రామాల స్థానిక మత్స్యకారులకు ప్రధాన జీవనాధారం చేపల వృత్తి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సంయుక్తంగా నిర్మిస్తున్న ఆక్వా పార్కులో ఈ నాలుగు గ్రామాల మత్స్యకారులను భాగస్వామ్యం చేయాలని, యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఆక్వా పార్కు నిర్మాణంలో ఇలాంటి అవకతవకలు జరగకుండా పారదర్శకంగా నిర్మించాలని, నాలుగు గ్రామాల నుంచి మత్స్యకారుల 25 మంది కమిటీని భాగస్వామ్యం చేయాలని, మత్స్యకారుల గ్రామాల్లో చాపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బోయిరి శ్రీకాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు, మంచర్ల రాజేందర్ జిల్లా అధ్యక్షులు, బోడంకి చందు జిల్లా కార్యదర్శి, జునవరి నారాయణ జిల్లా ఉపాధ్యక్షులు, గగ్గురి రాజన్న జిల్లా సహాయ కార్యదర్శి, బోయిరి రాజకుమార్ జిల్లా నాయకులు, మత్స్యకారులు జునగారి మల్లేష్, మొగుళ్ళ మహేష్, బొగ్గుల చంద్రశేఖర్, రాకేష్, జునగాని గణేష్, ఉట్నూరి రాజ నర్సు, తదితర మత్స్యకారులు పాల్గొన్నారు.

కూరగాయల పంటలతో రైతులకు అధిక లాభాలు

మండల ఉద్యానవన విస్తరణ అధికారి బి.రాము

ప్రజానావ, పెద్దపల్లి : మండలం లోని బందంపల్లి, ఆపన్నపేట శివార్లలోని కూరాగయ తోటలను మండల ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము పరిశీలించారు. ముక్యంగా రైతులు పంట మార్పిడి చేపట్టాలని వరి, పత్తి, మొక్కజొన్న పంటలకి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లు, పామాయిల్ తోటల సాగు చేపట్టాలని ఉద్యాన విస్తరణ అధికారి బి.రాము అన్నారు. ఈ మేరకు పంట మార్పిడి విధానం ప్రత్యామ్నాయ పంటల సాగు పై రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. పంట మార్పిడి తో రైతులకు ఆదాయ మార్గాలు ఏర్పడతాయాని, మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. బోర్ల కింద బావులా కింద డ్రిప్ తో ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పామాయిల్ తోటలు సాగు చేయాలన్నారు. కూరగాయల నారు టమాట, మిర్చి, వంకాయ 100 శాతం సబ్సిడీతో ఉందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూరగాయల సాగులో మేలైన మల్చింగ్ పద్ధతిలో సాగు చేయాలన్నారు. పొలం శ్రీనివాస్, దామోదరి శ్రీనివాస్, సంపత్ రైతులు కూరగాయల రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు విడుదల చేయాలి

ప్రజానావ, వేములవాడ: రైతులకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ఆధ్వర్యంలో సోమవారం ఆయన నివాసంలో రేవంత్‌రెడ్డికి రక్తదానం పేరుతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 25 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం చల్మెడ మాట్లాడుతూ, రైతుల పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్య లు అభ్యంతరకరమని విమర్శించారు. రైతులకు కాళేశ్వరం నీటిని వెంటనే విడుదల చేయాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏనుగు తిరుపతి రెడ్డి, రామతీర్థపు రాజు, వెంగళ శ్రీకాంత్ గౌడ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..

విలేకరులు కావలెను

రెండు తెలుగు రాష్ట్రాల్లో వేగంగా విస్తరిస్తున్న తెలుగు దినపత్రిక ప్రజానావలో
పని చేయుటకు మా సంస్థ ఆహ్వానం పలుకుతోంది

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలు,
నియోజకవర్గ కేంద్రాలు,
మండల కేంద్రాల్లో పనిచేయుటకు విలేకరులు కావలెను.

మండలాలు, అర్బన్, పట్టణ కేంద్రాల్లో
పనిచేసే వారికి కనీస అర్హత ఇంటర్మీడియట్

స్టాఫ్ రిపోర్టర్, ఆర్‌సీ ఇన్‌చార్జీలకు
కనీస అర్హత డిగ్రీ ఉండాలి

మీ బయోడేటాను ఇప్పుడే ఈ నెంబర్లకు వాట్సాప్ చేయండి

☎ 9948433277, 9014966169



ప్రహసనంగా మారిన ఎస్ఐఆర్ ప్రక్రియ!

EDITORIAL

> తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్ర స్థాయిలో ఘరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫావ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థి తులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫావ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాం తాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు.

ఆధార్ సక్రమంగానే ఉంటోంది. పాన్ కార్డు సక్రమంగానే ఉంటోంది. గ్యాస్ కనెక్షన్ డా పక్కాగా ఉంటోంది. బ్యాంక్ అకౌంట్ కూడా పక్కా గానే ఉంటోంది. ఇంటినంబర్లు, చెల్లింపులు ఇలా చెప్పుకుంటూ పోతే అన్నీ పక్కాగా ఉంటున్నా..ఓటు మాత్రం పక్కాగా ఉండడం లేదు. ఎఐని అడిగితే ఎలా పక్కాగా చేయవచ్చో చెబుతుంది. ఆధునిక టెక్నాలజీ ఉపయోగిస్తే పక్కాగా ఓటరు కార్డు వస్తుంది. కానీ ఎన్నికల సంఘం, కేంద్రానికి ఇవేమీ పట్టడం లేదు. పర్మినెంట్ ఓటరు కార్డు నంబర్ ఉంటే ఓటు కోసం గందరగోళం పడాల్సిన అవసరం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఓటును పక్కాగా ఉంచుకుంటారు. ఎవరైనా అడ్రస్ మారితే మార్చుకుంటారు. ఆధార్ విషయంలో ఇదే జరుగుతోంది. కానీ ఘనత వహించిన ఎన్నికల సంఘం మాత్ర దీనిని ఓ మాయగా తయారు చేసింది. చదువుకున్న వారికి సైతం అర్థం కాని ప్రక్రియగా చేశారు. టెక్నాలజీ ఇతంగా పెరిగినా ఉపయోగించుకోవడంలో ఎన్నికల సంఘం పూర్తిగా విఫలం అయ్యిందని చెప్పాలి. తాజాగా కొనసాగుతున్న సర్ ప్రక్రియ ఓ ప్రహసనంగా మారంది. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ సర్ పక్రియ తీరు క్షేత్ర స్థాయిలో ఘరంగా తయారైంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అందరికీ ఎన్యుమరేషన్ ఫావ్‌లు పంచేసి రికార్డు సృష్టించామని అధికారులు చెప్తున్న లెక్కలకు, క్షేత్రస్థాయిలో ఓటర్లు ఎదురొంటున్న వాస్తవ పరిస్థితులకు అస్సలు పొంతన కుదరడం లేదు. ఎన్యుమరేషన్ ఫావ్‌ల పంపిణీ దాదాపు వందశాతం పూర్తయినట్టు రికార్డుల్లో చూపిస్తున్న ప్రాంతాల్లో కూడా కనీసం బూత్ లెవల్ అధికారులు అంటే బీఎల్‌వోలు అడుగుపెట్టలేదని ఓటర్లు చెబుతున్నారు. కొందరైతే వారెలా ఉంటారో కూడా చూసి ఉండలేదంటున్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం సోమవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి 99.98 శాతం మందికి ఎన్యుమరేషన్ ఫావ్‌ల పంపిణీ పూర్తయింది. 26 జిల్లాల్లో ఎన్యుమరేషన్ ఫావ్‌ల పంపిణీ వంద శాతం పూర్తి చేశామని అధికారులు కాగితాల్లో లెకలు చూపిస్తున్నారు. ఉన్నతాధికారుల సమక్షల్లో శభాష్ అనిపించుకోవడానికి క్షేత్రస్థాయి సిబ్బంది చూపించిన ఈ అంకెల గారడీ ఇప్పుడు ఓటర్ల పాలిట శాపంగా మారింది. అధికారులు వంద శాతం పంపిణీ అని చెప్తుంటే.. నగర, పట్టణ ప్రాంతాల ఓటర్లు మాత్రం 'మా కాలనీ, మా ఇండ్లకు అసలు బీఎల్‌వోలు వచ్చిన దాఖలాలే లేవు. మాకు అందాల్సిన ఎన్యుమరేషన్ ఫావ్‌లు ఎటు పోయాయని ప్రశ్నిస్తున్నారు. దీని బదులు ఏ వూసేవా సెంటర్‌లో పెట్టినా హాయిగా వెళ్లి సవరణలు చేసుకునే వారమని అంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, దాని చుట్టుపకల ఉన్న గేటెడ్ కమ్యూనిటీలు, శివారు కాలనీల్లో చాలామందికి ఫావ్‌లు అందనే లేదు. అధికారులు ఇండ్ల వద్దకు వచ్చి వివరాలు సేకరించకుండానే, ఆఫీసుల్లో ర్చొని ఫావ్‌ల పంపిణీ అయిపోయినట్టు టిక్ మార్కులు పెట్టేసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిర్ణీత గడువులోగా పక్రియ పూర్తి చేయాలనే పైఅధికారుల ఒత్తిడికి భయపడి క్షేత్రస్థాయి సిబ్బంది తూతూమంత్రంగా పని కానిచ్చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సర్ నిబంధనల ప్రకారం బీఎల్ఓలు మూడుసార్లు ఓటర్ల ఇళ్లకు వెళ్లాలన్న నియమం ఉన్నా కనీసం ఒక్కసారిడా కనిపించకుండానే పోతున్నారు. నగరాలు, పట్టణాల్లోని అనేక కాలనీల్లో బిఎల్‌వోలు సందర్శించిన ప్రాంతాలు వేళ్లపై లెక్కపెట్టవచ్చు. ఒక్కసారి కూడా రాని ప్రాంతాలు వందల్లో ఉంటాయి. అయినా అంతా సజావుగా సాగుతోందని ఎన్నికల కమిషన్ గొప్పగా చెప్పుకుంటోంది. ప్రజలందరి చేతుల్లో మొబైల్ ఫోన్లు ఉండి, సామాజిక మాధ్యమం నిఘా విస్తృతంగా ఉన్న నేపథ్యంలో బీఎల్ఓలు ఒక్కచోటే ర్చొని ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తున్న దృశ్యాలు వందలు కనపడుతున్నాయి. ఇపూర్తిచేసిన ఫారాలను కూడా ఓటర్లే మళ్లీ బీఎల్ఓల వద్దకు వెళ్లి సమర్పించుకునే పరిస్థితే చాలా చోట్ల ఉంది. సర్ పక్రియ దరిద్రంగా సాగుతోందనడానికి ఇంతకన్నా నిదర్శనం అవసరం లేదు. గతంలో బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ప్రజలు గగ్గోలు పెడుతుంటే ..ఇక్కడ ఉన్నవారికి అదో వింతగా అనిపించింది. కానీ ఇప్పుడు మనకు అనుభం కావడంతో అసలు ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రక్రియ ఇలాగే సాగితే తెలుగు రాష్ట్రాల్లో కనీసం 50 శాతం ఓట్లు గల్లంతు కావడం ఖాయం. ఆషామాషీగా ఒక వ్యక్తిని ఓటరుగా నమోదు చేయదదు. అలాగే తొలగించడం కూడా సరికాదు. ఆధార్ కార్డును ఓటరుగా గుర్తించేందుకు ఉపయోగ పడదని ఇప్పటి ఇసి తేల్చి చెప్పింది. ఆధార్ కార్డు ప్రామాణికం కాదనే వాదన ఎంత లోపభూయిష్టమో అర్థం చేసుకోవాలి. నిజానికి ఓటు నమోదు, తొలగింపే ఓ ప్రహసనంగా మారడం విడ్డూరంగా ఉంది. వారికి అప్పగిస్తే ఎలా ఓటు నమోదు చేయాలో, దానికి ఎలా పర్మినెంట్ నంబర్ ఉండాలో చెబుతారు. బిఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపించుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు. ఇలాంటి తలనొప్పులను అధికారులు గుర్తించడం లేదు. అది ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యం.

> బీఎల్‌వోలు ఇంటింటికీ తిరగకుండా గ్రామస్థాయిలో పంచాయితీల సహకారం తీసుకోవాలి. పట్టణాల్లో వార్డుస్థాయి అధికారుల సహాయం తీసుకుంటే బాగుండేది. రకరకాల కారణాలతో కొరతలతో దాదాపు కోటిమంది 11 రకాల డాక్యుమెంట్లలో ఏదో ఒకదాన్ని సమర్పించి తమనితాము అసలైన ఓటర్లుగా నిరూపిం చుకోవాలి. ఈ తంతు మొత్తం తలనొప్పిగా ఉందే తప్ప సజావుగా ఓటను పదిలపర్చుకునేలా లేదు.

ఉద్యోగాల భర్తీ కోసం నేడు ఇందిరాపార్కు వద్ద ధర్నా

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం జూలై 15న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం, డిగ్రీ, పీజీ, బీఈడీ కళాశాలలతో పాటు విద్యార్థి వసతి గృహాల్లో మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కేంద్రం హామీ ఇచ్చిన విధంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, శాఖల్లో ఖాళీగా ఉన్న 10 లక్షల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం సైతం ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల ఉద్యోగాలు, 20 వేల పోలీస్ పోస్టులతో పాటు గ్రూప్–1, 2, 3, 4, డీఎస్సీ, జేఎల్ నోటిఫికేషన్లను తక్షణమే విడుదల చేయాలని కోరారు. ఈ ధర్నాలో నిరుద్యోగ యువతీ యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

విద్యుత్ వెలుగులు.. సాగునీటి జలకళ!

- అలంపూర్‌లో రూ. 376.25 కోట్ల విద్యుత్ పనులకు శ్రీకారం
- యుద్ధప్రాతిపదికన దేవాదుల పూర్తి: డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: రాష్ట్రంలో వ్యవసాయం, గృహ, పారిశ్రామిక రంగాల బలోపేతానికి, సాగునీటి రంగానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. ఇందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజక వర్గంలో రూ.376.25 కోట్ల విలువైన విద్యుత్ అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎర్రవల్లి వద్ద రూ.155 కోట్లతో 220/132/33 కేవీ, రాయపురం వద్ద రూ.48 కోట్లతో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ప్రారంభించారు. గోదావరి జలాలతో రైతులకు భరోసా మరోవైపు ములుగు జిల్లాలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టును ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం పరిశీలించారు. సమ్మక్క సారలమ్మ బ్యారేజీతో పాటు దేవాదుల పంపుహౌస్ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. దేవాదుల కింద 6.14 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించడమే లక్ష్యంగా 38.16 టీఎంసీల నీటిని సంపూర్ణంగా వినియోగించుకునేలా పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో అవినీతికి పాల్పడిందని విమర్శిస్తూ, కాళేశ్వరం వైఫల్యాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమని మంత్రులు స్పష్టం చేశారు.

మున్నేరు రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి

- డ్రైనేజీ డిజైన్ ఖరారు చేసి సమగ్ర కార్యాచరణ నివేదిక సమర్పించాలని ఆదేశం

ప్రజానావ, ఖమ్మం: మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు భూసేకరణ, డ్రైనేజీ వ్యవస్థ, లేఅవుట్ అభివృద్ధి తదితర పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేసేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి మున్నేరు పరిరక్షణ గోడ నిర్మాణ పనుల పురోగతి, ఎన్ఎస్‌పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధి, డ్రైనేజీ డిజైన్, భూసేకరణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్ఎస్ పీ భూముల్లో లేఅవుట్ అభివృద్ధికి సంబంధించి అధికారులు అప్రోచ్ రోడ్డు, వంతెన నిర్మాణ ప్రతిపాదనలు సమర్పించారని, అయితే జాతీయ రహదారుల శాఖ ఇంజినీర్ సూచనల మేరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణ సాధ్యాసాధ్యాలను పరిశీలించి సవరించిన తుది ప్రతిపాదనను రెండు రోజుల్లో సమర్పించాలని ఆదేశించారు. మున్నేరు పరిరక్షణలో భాగంగా చేపడుతున్న డ్రైనేజీ వ్యవస్థ రూపకల్పనను తక్షణమే ఖరారు చేయాలని సూచిస్తూ ప్రధాన, ఉప డ్రైన్లు ఎక్కడ ఏర్పాటు చేయాలి, వాటి ద్వారా నీటి ప్రవాహం ఎలా మళ్లించబడుతుంది, మొత్తం డ్రైనేజీ నెట్‌వర్క్ ఎలా పనిచేస్తుందనే అంశాలతో కూడిన సమగ్ర సాంకేతిక నివేదికను సిద్ధం చేసి అందించాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణ పెండింగ్‌లో ఉన్న ప్రాంతాలు మినహా రిటైనింగ్ వాల్ నిర్మాణం ఇంకా పూర్తికాని రెండు స్ట్రెచ్‌లలో పనులను యుద్ధ ప్రాతిపదికన వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ప్రతి పనిని నిరంతరం పర్యవేక్షిస్తూ కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. లేఅవుట్ అభివృద్ధి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను పూర్తిగా వివరించి, సానుకూలంగా ఉన్న భూయజమానులతో వెంటనే చర్చలు ప్రారంభించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రజల్లో అపోహలు తొలగేలా అవగాహన కల్పిస్తూ పరస్పర విశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మతపరమైన నిర్మాణాలు, శ్మశానవాటికలు వంటి సున్నితమై న అంశాల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా సామరస్యపూర్వక చర్చలతో సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం పెంపొం దించి సాంకేతిక అంశాలు, భూసేకరణ, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా ప్రతి రోజూ పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ ఎం. వెంకటేశ్వర్లు, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ వాణిశ్రీ, పీఆర్ ఈఈ మహేష్‌బాబు, వివిధ శాఖల ఈఈలు, డీఈలు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టర్ అనురాగ్ జయంతి

ప్రజానావ, యాదాద్రి భువనగిరి: జిల్లాలో ప్రజారోగ్య కార్యక్రమాల అమలును వేగవంతం చేసి ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుతో కలిసి ఆరోగ్య శాఖ పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ అమలు, డెంగ్యూ, మలేరియా నివారణ చర్యలు, క్షయ వ్యాధి గుర్తింపు, నాన్ కమ్యూనికబు ల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) స్క్రీనింగ్, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపు, ఎన్‌క్యూఏఎస్ ప్రమాణాల అమలు వంటి కార్యక్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎం. మనోహర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. సూర్యశ్రీతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిలో వర్షపు నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ నర్సయ్య

ప్రజానావ, మోత్కూరు: ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేసి భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ గోలుకొండ నర్సయ్య అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'క్యాచ్ ది రైన్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులకు ఇంకుడు గుంతల ప్రాముఖ్యత, భూగర్భ జలాల సంరక్షణ, నీటి పునర్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి వృథాను నివారించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, వర్షపు నీటిని సద్వినియోగం చేసుకుంటే భవిష్యత్ తరాలకు నీటి వనరులను సంరక్షించగలమని పేర్కొన్నారు. విద్యార్థులు నీటి సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. తమ కుటుంబ సభ్యులను కూడా ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రోత్సహించాలని, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు, మున్సిపల్ ఇన్‌చార్జి మేనేజర్ షాబాజ్, పట్టణ ప్రణాళిక అధికారి వెంకటేష్, మున్సిపల్ సిబ్బంది శ్రవణ్, నిఖిల్, కిరణ్, కురిమిళ్ల రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు బేటీ బచావో-బేటీ పడావో

- జులై నెలాఖరులోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో 'పోష్' కమిటీలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజానావ, సూర్యాపేట: జిల్లాలో బాలికల రక్షణ, వారి విద్యాభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యాల సాధనకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు. 'బేటీ బచావో–బేటీ పడావో' పథకంలో భాగంగా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన వివిధ శాఖల ఉన్నతాధికారుల సమన్వయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో విజయవంతంగా నిర్వహించిన 'బాలికా చైతన్యం' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. బాలికల్లో అవగాహన, ఆత్మవిశ్వాసం పెంపొందించ డంలో ఈ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం (పోష్ చట్టం) ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను జులై నెలాఖరులోగా పూర్తిచేయడంతో పాటు కమిటీ సభ్యులకు సంబంధిత చట్టాలపై ప్రత్యేక శిక్షణ కూడా నిర్వహించాలని సూచించారు. భ్రూణ హత్య నిరోధక చట్టం, సురక్షిత గర్భ విచ్ఛిత్తి చట్టాలను జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు, మహిళల ఆరోగ్య రక్షణకు వైద్య ఆరోగ్య శాఖతో పూర్తి సమన్వయంతో పనిచేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళలు, బాలికల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలయ్యేలా వైద్య ఆరోగ్య, విద్య, స్త్రీ–శిశు సంక్షేమ, పోలీసు, గ్రామీణాభివృద్ధి శాఖలు సమిష్టిగా పనిచేయాలని సూచించారు. జిల్లాలో బాల్యవివాహాలను పూర్తిగా అరికట్టడంతో పాటు బడి మానేస్తున్న బాలికల సంఖ్యను తగ్గించి వారికి ఉన్నత విద్య అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మహిళా సాధికారత కేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- 850 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు
- వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి హెచ్చరిక

ప్రజానావ, ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బుధవారం జూలై 15న వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణంలో పర్యటించనున్నారు. అక్కడ నూతనంగా నిర్మించిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవన ప్రారంభోత్సవానికి ఆయన విచ్చేస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. మంగళవారం కొత్తకోటలోని బి.పి.ఆర్ గార్డెన్స్‌లో బందోబస్తుకు వచ్చిన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఆమె దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, భద్రతలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా విధుల్లో ఉన్నప్పుడు పోలీసులు సెల్‌ఫోన్లు చూస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ట్రాఫిక్, పార్కింగ్, వీఐపీ రూట్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. మొత్తం భద్రతను 8 సెక్టార్లుగా విభజించి, ఒక ఎస్పీ, ఒక అడిషనల్ ఎస్పీ, నలుగురు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 54 మంది ఎస్సైలతో పాటు మొత్తం 850 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు స్పెషల్ పార్టీలు, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్స్ రంగంలోకి దిగాయన్నారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, డీఎస్పీలు గిరిబాబు, బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజానావ, మెదక్: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను జిల్లాలో వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు. కొల్చారం మండలం వరిగుంటం గ్రామంలో తహసీల్దార్, ఎంపీడీవోతో కలిసి బీఎల్‌వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను మంగళవారం ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయిలో ఫారాల పంపిణీ, స్వీకరణ, డేటా ఎంట్రీ పురోగతిపై ఆరా తీశారు. ఫారాలు పంపిణీ చేయడమే కాకుండా పూర్తిగా నింపిన దరఖాస్తులను తిరిగి సేకరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను సంప్రదించాలని, ఒక కుటుంబంలో ఒక సభ్యుడి మ్యాపింగ్ పూర్తయితే మిగిలిన అర్హులైన సభ్యుల వివరాలను కూడా నమోదు చేసి మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంకా ఫారాలు సమర్పించని కుటుం బాలను గుర్తించి మరోసారి ప్రత్యేకంగా సంప్రదిం చాలని తెలిపారు. మరణించిన వారు, ఇతర ప్రాంతా లకు శాశ్వతంగా మారిన ఓటర్ల వివరాలను ప్రత్యేకంగా నమోదు చేసి నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. బీఎల్‌వోలు ఓటర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశించారు.

Singareni news

2వ గనిలో ఐఎన్‌టీయూసీ గేట్ మీటింగ్

- **కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యమని నాయకుల హామీ**

ప్రజానావ, రామగుండం: సింగరేణి కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఐఎన్‌టీయూసీ నిరంతరం కృషి చేస్తోందని ఆ సంఘం నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు జీడీకే–2వ గనిలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఐఎన్‌టీయూసీ సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధర్మపురి నరసింహారెడ్డి మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి జనక్ ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంతో నిరంతరం చర్చలు జరుపుతున్నారని తెలిపారు. ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు ఏర్పాటుకు కృషి చేసి ఈ నెల 18న బోర్డు ఏర్పాటు కానుందని వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని మారుపేర్ల సమస్యపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో చర్చించి సమస్య పరిష్కారానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టేలా కృషి చేశారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో పాటు సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెంచేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం, ఐఎన్‌టీయూసీ యూనియన్ ఎల్లప్పుడూ సింగరేణి కార్మికుల శ్రేయస్సు, హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తుందని చెప్పారు. తప్పుడు హామీలు ఇచ్చే ఇతర పార్టీలు, యూనియన్ల మాటలను నమ్మి కార్మికులు మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌జీ–1 వైస్ ప్రెసిడెంట్ సదానందం, డిప్యూటీ జనరల్ సెక్రటరీలు గడ్డం కృష్ణ, రాజేందర్, వద్దేపల్లి దాస్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి పి. సమ్మయ్య, అవినాష్, బ్రాంచ్ సెక్రటరీ గుండేటి శ్రీనివాస్, ఎదులపురం శ్రీనివాస్, రాజశేఖర్, ఫిట్ సెక్రటరీలు 2 ఇంక్లైన్ రాజు, 1 ఇంక్లైన్ రమేష్, ఓసీపీ–5 ఆంజనేయులు, సివిల్ శ్రీనివాస్, జీఎం కార్యాలయానికి చెందిన గబ్బర్, ఏరియా వర్క్‌షాప్‌కు చెందిన ఖాదీర్, శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సింగరేణికి సీపీఎస్‌యూ హోదా కల్పించాలి

- **కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్‌రెడ్డికి జనక్ ప్రసాద్ వినతి..**
- **సానుకూలంగా స్పందించిన మంత్రి**

ప్రజానావ, రామగుండం: సింగరేణి సంస్థకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ (సీపీఎస్‌యూ) హోదా కల్పించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ డాక్టర్ జనక్ ప్రసాద్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరారు. జీడీకే ఓసీపీ–5 గని సందర్శనకు వచ్చిన కేంద్ర మంత్రిని గెస్ట్‌హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన జనక్ ప్రసాద్ పలు కీలక అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఇటీవల సింగరేణికి తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను కేటాయించి నందుకు కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సింగరేణికి సీపీఎస్‌యూ హోదా కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ హోదా లభిస్తే భూసేకరణ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు చట్టపరమైన, పర్యావరణ అనుమతులు త్వరితగ తిన లభించే అవకాశం ఉంటుందని, కొత్త గనుల విస్తరణకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. అలాగే దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడంలోనూ, తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో సింగరేణి మరింత కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనిపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ సింగరేణికి సీపీఎస్‌యూ హోదా కల్పించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు జనక్ ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్లు ధర్మపురి నరసింహారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు శ్యామ్, దాస్, సదానందం, జనరల్ సెక్రటరీ వికాస్‌కుమార్ యాదవ్, మైనింగ్ స్టాఫ్ ఇన్‌చార్జి తిరుపతి రాజు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగె స్వామితో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి

ప్రజానావ, పెద్దపల్లి : సింగరేణి సీఎస్ఆర్ నిధులతో వడకాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల, గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి వినతిపత్రం బీజేపీ యువ నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ అందజేశారు. సింగరేణి భరోసా యాత్ర సందర్భంగా కాటారం విచ్చేసిన కేంద్ర బొగ్గు అండ్ గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని బీజేపీ యువ నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎస్ఆర్ నిధుల ద్వారా జూలపల్లి మండలంలోని వడకాపూర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, నూతన పాఠశాల భవనం, అదనపు తరగతి గదులు, విద్యార్థులకి టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే గ్రామంలో తాగునీటి సౌకర్యం, హైమాస్ట్ ఎల్ఈడీ లైట్లు, గ్రంథాలయం, ఇతర ప్రజా మౌలిక వసతుల అభివృద్ధికి కూడా సింగరేణి సీఎస్ఆర్ నిధులను వినియోగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

టీపీయూఎస్ ఉపాధ్యాయుల ధర్నా

- **సిరిసిల్లలో బీజేపీ సంఘీభావం**
- **ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి**
- **బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి**

ప్రజానావ, సిరిసిల్ల : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, విద్యారంగ సమస్యలను ఇకపై నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట టిపియూఎస్ (తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ నిర్వహించిన ధర్నా కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి హాజరై పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ ఉపాధ్యాయులు కొత్తగా ఎలాంటి ప్రయోజనాలు కోరడం లేదని, చట్టబద్ధంగా తమకు రావలసిన హక్కులు, బకాయిలు, ప్రభుత్వమే ఇచ్చిన హామీల అమలును మాత్రమే కోరుతున్నారని అన్నారు. గత ప్రభుత్వాల మాదిరిగానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించిందని విమర్శించారు. ఉపాధ్యాయ సంఘాలు పలుమార్లు ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. సమాజానికి మంచి పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేయడం తగదని, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ తరఫున రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావ డానికి బీజేపీ ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల ద్వారా ప్రత్యేక ప్రతినిధి పత్రాన్ని సమర్పించి ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు, వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్ శంకర్, సిరిసిల్ల బీజేపీ పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచాలి

- **కలెక్టర్ కోయ శ్రీహర్ష**
- **20 రోజుల్లో ప్రతి ఏఈఓ 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలి**
- **తగ్గుతున్న భూగర్భ జలాల దృష్ట్యా రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు చైతన్యపరచాలి**
- **ప్రతి క్లస్టర్‌లో మహిళా శక్తి కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి**
- **ఆయిల్ పామ్ సాగు, పంటల ప్రణాళికపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష**

ప్రజానావ, పెద్దపల్లి : జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణాన్ని వేగంగా పెంచడంతో పాటు నీటి లభ్యతకు అనుగుణంగా రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మళ్లించేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, పంటల ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా జిల్లాలో సాగు చేసిన ఆయిల్ పామ్ తోటలు ప్రస్తుతం దిగుబడులు ఇవ్వడం ప్రారంభించాయని, రైతులకు సకాలంలో చెల్లింపులు జరుగుతుండటంతో ఇతర రైతుల్లో కూడా ఈ పంటపై ఆసక్తి పెరుగుతోందన్నారు. గత 45 రోజుల్లోనే సుమారు 300 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తయ్యాయని, రైతుల ఆసక్తి మరింత పెరిగిన నేపథ్యంలో చిన్నపాటి ప్రోత్సాహం కల్పిస్తే జిల్లాకు నిర్దేశించిన 1,100 ఎకరాల లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చని తెలిపారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వచ్చే 20 రోజుల్లో కనీసం 15 ఎకరాలను ఆయిల్ పామ్ సాగుకు మార్చేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రతి క్లస్టర్‌లో ఈ నెలాఖరులోగా కనీసం 15 ఎకరాల్లో ఆయిల్ పామ్ నాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఒకే ప్రాంతంలో 30 నుంచి 40 ఎకరాలు లేదా అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు జరిగితే అవసరమైన బోర్‌వెల్లు, ప్రత్యేక విద్యుత్ లైన్లు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. పెద్ద ఎత్తున సాగు జరిగే ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, గత ఏడాదితో పోలిస్తే భూగర్భ జలాలు సుమారు ఒకటిన్నర మీటరు మేర తగ్గడం ఆందోళన కలిగించే అంశమన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని ప్రధాన జలాశయాలు, చెక్‌డ్యామ్‌లు నిండితేనే దిగువ ప్రాంతాలకు నీటి లభ్యత ఉంటుందని, ప్రస్తుతం పరిస్థితులు అత్యంత క్లిష్టంగా ఉన్నాయని తెలిపారు. జిల్లాలోని 90 శాతం చెరువుల్లో 50 శాతం కన్నా తక్కువ నీటి నిల్వలు మాత్రమే ఉన్నాయని, రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే పంటలు సాగు చేసేలా నిరంతరం చైతన్యం కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, విత్తన విక్రేతలు, ఆదర్శ రైతులు గ్రామ స్థాయిలో రైతులకు వాస్తవ పరిస్థితులను వివరించాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ఏడు రకాల పంటలకే కొనుగోలు సదుపాయం ఉంటుందని, ఇతర పంటలకు బోనస్ వర్తించదనే విషయాన్ని ప్రతి రైతుకు స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. రైతు బీమా క్లెయిమ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో ఉండకూడదని, అర్హులైన కుటుంబాలకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 20 రోజులకు మించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. జనగామ జిల్లాలో ప్రతి క్లస్టర్‌లో మహిళా శక్తి కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువుల విక్రయ కేంద్రాలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని, అదే తరహాలో జిల్లాలో కూడా ప్రతి క్లస్టర్‌కు ఒక మహిళా శక్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో తిరుమల ఆయిల్ కంపెనీ సీఈవో కళ్యాణ్, నీటిపారుదల శాఖ ఈఈ శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ ఉద్యానవన శాఖ అధికారి శ్యాం ప్రసాద్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలు, ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి

- **నిబంధనల అమలులో రాజీ వద్దని అధికారులకు జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న ఆదేశం**

ప్రజానావ, వరంగల్ : పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, నాణ్యమైన సేవలు అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న ఆదేశించారు. జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పట్టణ ప్రణాళికకు సంబంధించిన పలు కీలక అంశాలపై విభాగాల వారీగా సమీక్ష నిర్వహించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. నగరంలో కొనసాగుతున్న అనధికార నిర్మాణాలు, శిథిలావస్థకు చేరిన ప్రమాదకర భవనాలు, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుల పరిష్కారం, టీడీఆర్‌ల జారీ, ప్రభుత్వ స్థలాలు, రహదారులపై ఆక్రమణల తొలగింపు, అనధికార హోర్డింగ్‌లు, పోస్టర్లు, ఫ్లెక్సీల తొలగింపు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. నగరంలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలను గుర్తించి వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మాణాలు చేపట్టడం, సెల్లార్లను దుర్వినియోగం చేయడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దని కమిషనర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు నిర్వహించి నిబంధనల అమలులో రాజీ లేకుండా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని శిథిలావస్థలో ఉన్న ప్రమాదకర భవనాలను గుర్తించి యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేయాలని, నివాసయోగ్యం కాని భవనాల్లో ఉంటున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి అర్హులైన వారికి నిర్ణీత గడువులో పరిష్కారం అందించాలని, టీడీఆర్‌ల జారీ ప్రక్రియను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలు, రహదారులు, కాలువలు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను ప్రత్యేక కార్యాచరణతో తొలగించి నగరాన్ని క్రమబద్ధంగా అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నగరాభివృద్ధికి సంబంధించిన ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనల అమలులో రాజీ లేకుండా సుస్థిరమైన, ప్రణాళికాబద్ధమైన నగరాభివృద్ధికి కృషి చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. సమావేశంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఏసీపీలు ఖలీల్, నస్రీన్ భాను, ప్రశాంత్, టీపీఎస్‌లు, టీపీబీఓలు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఉక్కుపాదం

- **46 మంది పట్టివేత.. రూ.55,500 జరిమానా**
- **ఏడుగురికి ఒక రోజు జైలు శిక్ష.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలే**

ప్రజానావ, కామారెడ్డి: జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన 46 మందిని పోలీసులు పట్టుకున్నారు. వారిని సంబంధిత న్యాయస్థానంలో హాజరుపరచగా మొత్తం రూ.55,500 జరిమానా విధించడంతో పాటు ఏడుగురికి ఒక రోజు జైలు శిక్షను న్యాయస్థానం విధించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలు కూడా ప్రమాదంలో పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ప్రజలకు సూచించారు. ప్రజల ప్రాణ రక్షణే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డా. పత్తిపాక మోహన్‌కు 'పెండెం' జాతీయ బాల సాహిత్య పురస్కారం

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్లకు చెందిన కవి, రచయిత, బాల సాహితీ వేత్త, తెలుగునాట బాల సాహిత్య వికాసం కోసం కార్యశాలలు నిర్వహి స్తున్న డా. పత్తిపాక మోహన్ కు 2026 సంవత్సరానికి గాను ప్రసిద్ధ తెలంగాణ బాల సాహితీవేత్త, తెలంగాణ జీవభాషలో బాలల సాహిత్యం సృజన చేసిన రచయిత 'పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ బాల సాహిత్య పురస్కారం ' 2026'ను పురస్కార కమిటి నల్లగొండలో ప్రకటించింది. చిరకాలంలోనే అనేక రచనలు చేసి తెలంగాణ బాల సాహిత్యాకాశంలో వేగుచుక్కగా వెలిగిన స్వర్గీయ పెండెం జగదీశ్వర్ నల్లగొండ జిల్లా రామన్నపేటలో పుట్టారు. బాలల కోసం కథలు, తెలంగాణ భాషలో కథలు, పొడుపు కథలు, జానపద కథలు వ్రాసి ప్రచురించారు. స్వయంగా కార్టునిస్టు, చిత్రకారుడైన పెండెం అనేక పత్రికలకు కార్టున్లను గీశారు. పెండెం జ్ఞాపకంగా ఆయన మిత్రులు, సాహితీవేత్తలు జాతీయ పురస్కారం నెలకొల్పి అందిస్తున్నారు. ఈ కోవలో 2026 సంవత్సరానికి గాను బాల సాహిత్య వికాసం, ప్రచారం, రచనతో పాటు కార్యశాలల నిర్వహణలో పత్తిపాక మోహన్ చేస్తున్న కృషికి గాను కమిటి ఈ పురస్కారంను ప్రకటించింది. 19 జులై, 2026 ఆదివారం ఉదయం 10 గంటలకు నల్లగొండలో జరిగే సభలో మోహన్‌కు ఈ పురస్కారం ప్రదానం కింద నగదు, ప్రశంసా పత్రం అందించి సత్కరిస్తారని కమిటి పక్షాన ఆచార్య కృష్ణ కౌండిన్య తెలిపారు. మారసం వ్యవస్థాపకులు, కేంద్ర సాహిత్య అకాడమి బాల సాహిత్య పురస్కార గ్రహీత పత్తిపాక మోహన్‌కు అవార్డు రావడం పట్ల రాజన్న సిరిసిల్లజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఎలగొండ రవి, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, మానేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు టి,వి,నారా యణ, గెంట్యాల భూమేష్, డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, బూర దేవానందం, జిందం అశోక్, జి.శ్రీమతి, మదూరి అనిత, తదితరులు అభినందనలు తెలిపారు.

డైయింగ్ యూనిట్ల కోసం.. ప్రత్యేక పారిశ్రామిక స్థలం కేటాయించాలి

- **సదుపాయాలు లేక మూతపడుతున్న యూనిట్లు, ఉపాధి కోల్పోతున్న కార్మికులు**
- **రక్షణ చర్యలపై కలెక్టర్‌కు యూనిట్ల యజమానుల వినతి**

ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్లలోని చిన్న తరహా డైయింగ్ యూనిట్ల కోసం ప్రత్యేక పారిశ్రామిక స్థలం కేటాయించి, కామన్ ఎంప్లాయిమెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఈటిపి) నిర్మించాలని చిన్న తరహా అద్దకం పరిశ్రమల పారిశ్రామికులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. సిరిసిల్ల పట్టణంలో వస్త్ర పరిశ్రమకు ప్రసిద్ధి చెందినప్పటికీ ప్రస్తుతం డైయింగ్ పరిశ్రమ రోజు రోజుకు తగ్గిపోతున్నదన్నారు. గతంలో చిన్న తరహా డైయింగ్ పరిశ్రమలు 150 వరకు ఉండగా ప్రస్తుతం సిరిసిల్ల పట్టణం, పరిసర ప్రాంతాలలో 50కి పైగా మాత్రమే యూనిట్లు పనిచేస్తున్నాయని, ఈ యూనిట్లపై ప్రత్యక్షంగా పరోక్షంగా అనేక మంది కార్మికులు, నేత కార్మికులు, రవాణా కార్మికులు, వారి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నట్లు తెలిపారు.డైయింగ్ పరిశ్రమను ఆధునీకరించి నాణ్యమైన వస్త్ర అద్దకం కొరకు చిన్న డైయింగ్ యూనిట్లకు వ్యక్తిగతంగా స్థలం కొనుగోలు చేయడం, సొంత ఎంప్లాయిమెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించడం, కాలుష్య నియంత్రణ నిబంధనలను అమలు చేయడం ఆర్థికంగా భారంగా మారిందన్నారు. సరైన పారిశ్రామిక స్థలం, మురుగునీటి శుద్ధి సదుపాయాలు లేకపోవడం వల్ల అనేక యూనిట్లు మూతపడే పరిస్థితికి చేరుకున్నాయని, దీనివల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు తగ్గడంతో పాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ మనుగడకు కూడా ప్రమాదం ఏర్పడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సిరిసిల్ల ప్రాంతంలోని చిన్న తరహా డైయింగ్ యూనిట్లు అన్నింటిని ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేసుకునే విధంగా ప్రభుత్వం తగిన పారిశ్రామిక స్థలాన్ని కేటాయించాలని కోరారు. ఆ స్థలంలో అవసరమైన రహదారులు, విద్యుత్, నీటి సరఫరా డ్రైనేజీ అలాగే ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. అలాగే చిన్న చిన్న డైయింగ్ యూనిట్ల నుంచి వచ్చే వ్యర్థ జలాలను శాస్త్రీయంగా శుద్ధి చేసేందుకు ప్రభుత్వ సహకారం మరియు సబ్సిడీతో కామన్ ఎంప్లాయిమెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్ (సిఈటిపి/ కామన్ ఈటీపీ) నిర్మించాలని కోరారు. కామన్ ఈటీపీ ఏర్పాటు ద్వారా కాలుష్య నియంత్రణ మండలి నిబంధనలను పాటించడంతో పాటు పర్యావరణాన్ని, భూగర్భ జలాలను, స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని రక్షించవచ్చు అని తెలిపారు.

జిల్లా కలెక్టర్ హామీ

డైయింగ్ యూనిట్ల సమస్యలను జిల్లా కలెక్టర్ శ్రద్ధగా విని, సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల అధికారులతో చర్చించి, సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకునేలా పరిశీలిస్తామని తెలిపినట్లు యూనిట్ల యజమానులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షులు తాటిపాముల దామోదర్, కార్యదర్శి గౌడ రాజు, ఉపాధ్యక్షులు ఏనుగుల ఎల్లయ్య, జాయింట్ సెక్రెటరీ సాప గణేష్, కోశాధికారి శ్రీగాద విష్ణు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసనగా.. సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు సామూహిక రక్తదానం

- **సిరిసిల్ల తెలంగాణ భవన్, వేములవాడలో రక్తదానం, పాల్గొన్న ముఖ్య నేతలు**

మా రక్తాన్ని అడిగావ్ కదా రేవంత్..
BRS

ప్రజానావ, సిరిసిల్ల/వేములవాడ : కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ల రక్తాన్ని పంట పొలాల్లో చల్లాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడినందుకు నిరసనగా బీఆర్ఎస్ శ్రేణులు సామూహిక రక్తదానం చేశారు. రాష్ట్రంలో ఎల్ నినో వల్ల వచ్చిన కరువు దృష్ట్యా తెలంగాణ రైతుల పంట పొలాలకు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా నీళ్లు ఇవ్వాలని అడిగినందుకు సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ల రక్తాన్ని పంట పొలాల్లో చల్లాలని మాట్లాడినందుకు నిరసనగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల తెలంగాణ భవన్ లో రక్తదాన శిబిరం నిర్వహించగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు రక్తదానం చేసి రైతులకు నీళ్లు ఇవ్వాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో నాఫ్స్ క్యాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, బీఅర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చీటీ నర్సింగారావు, గూడూరి ప్రవీణ్, జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ బొగ్గు బ్లాక్‌లు సింగరేణికే కేటాయించాలి

- **12వ వేజ్‌బోర్డు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఏఐటీయూసీ డిమాండ్**

ప్రజానావ, రామగుండం: తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను వేలం పాటకు పెట్టకుండా సింగరేణి సంస్థకే కేటాయించాలని, 12వ వేజ్‌బోర్డు ఒప్పంద ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కోరింది. సింగరేణిలో చేపట్టిన భరోసా యాత్రలో భాగంగా ఆర్‌జీ–1 ఏరియాలోని ఓసీపీ–5 గనిని సందర్శించిన కేంద్ర మంత్రికి ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో తెలంగాణలోని అన్ని బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, 12వ వేజ్‌బోర్డు వేతన ఒప్పందం కోసం వెంటనే వేతన కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే నాలుగు లేబర్ కోడ్‌ల అమలుతో సంబంధం లేకుండా గతంలో అమలు చేసిన విధంగానే 12వ వేజ్‌బోర్డు వేతన ఒప్పందాన్ని పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సింగరేణికి తాడిచెర్ల బ్లాక్–2ను కేటాయించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డికి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కామ్రేడ్ కవ్వంపల్లి స్వామి, బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్‌జీ–1 బ్రాంచి నాయకులు మాదన మహేష్, బోగ సతీష్‌బాబు, ఎస్. వెంకటరెడ్డి, గండి ప్రసాద్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నక్సలిజం నిర్మూలనపై కేంద్రానికి కృతజ్ఞతలు

- చత్తీస్‌గఢ్ శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదం
- మోదీ, అమిత్ షా నాయకత్వంతోనే విజయం
- భద్రతతో పాటు అభివృద్ధి, పునరావాసానికే ప్రభుత్వం ప్రాధాన్యం
- సీఎం విష్ణుదేవ్ సాయ్
- చారిత్రక ఘట్టం: స్పీకర్

రాయ్‌పూర్: రాష్ట్రంలో నక్సలిజం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ చత్తీస్‌గఢ్ శాసనసభ మంగళవారం తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. వర్షాకాల సమావేశాల రెండో రోజు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కేదార్ కశ్యప్ ప్రవేశపెట్టిన ఈ తీర్మానం, కాంగ్రెస్ సభ్యులు చర్చను బహిష్కరించిన నేపథ్యంలో సభ ఆమోదం పొందింది. దశాబ్దాలుగా వామపక్ష తీవ్రవాదం కారణంగా రాష్ట్రం తీవ్ర నష్టాన్ని చవిచూసిందని తీర్మానంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన భద్రతా బలగాలు, వ్యూహాత్మక సహకారం, అభివృద్ధి కార్యక్రమాల ఫలితంగా నక్సలిజాన్ని సమర్థంగా అదుపులోకి తీసుకురాగలిగామని వెల్లడించారు. ఈ పోరాటంలో ప్రాణత్యాగం చేసిన భద్రతా సిబ్బందికి సభ నివాళులర్పించింది.

మోదీ, అమిత్ షా పాత్ర కీలకం

చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యవేక్షణ, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, భద్రతా బలగాల త్యాగాలు, బస్తర్ ప్రజల సహకారంతో నక్సలిజంపై గణనీయమైన విజయం సాధించినట్లు తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు ఆర్థిక సాయం, భూమి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని సీఎం వెల్లడించారు. బస్తర్ రోడ్‌మ్యాప్–2.0, నియద్ నెల్లనార్ 2.0, బస్తర్ మున్నే అభియాన్ వంటి కార్యక్రమాల ద్వారా వేల గ్రామాల్లో ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్య, రహదారులు, రైల్వే, విమాన సౌకర్యాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఈ తీర్మానాన్ని శాసనసభ స్పీకర్ రమణ్‌సింగ్ చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు. ఒకప్పుడు భయాందోళనలకు కేంద్రంగా ఉన్న బస్తర్ ప్రాంతం ఇప్పుడు శాంతి, అభివృద్ధి దిశగా పయనిస్తోందని పేర్కొన్నారు. నక్సలిజంపై సాధించిన విజయం రాష్ట్ర చరిత్రలో కీలక మైలురాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

లైంగిక నేరాల బాధితులపై సున్నితంగా వ్యవహరించాలి

- దేశవ్యాప్తంగా కొత్త మార్గదర్శకాల అమలుకు సుప్రీంకోర్టు ఆదేశం
- కోర్టులు, పోలీసు, ప్రాసిక్యూషన్ వ్యవస్థలకు ఎన్‌జేఏ మార్గనిర్దేశం
- బాధితుల గౌరవం, న్యాయంపై విశ్వాసమే ప్రధాన లక్ష్యమన్న ధర్మాసనం

న్యూఢిల్లీ: లైంగిక నేరాల బాధితులపై న్యాయవ్యవస్థ మరింత సున్నితంగా, గౌరవప్రదంగా వ్యవహరించేలా నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ (ఎన్‌జేఏ) రూపొందించిన సమగ్ర మార్గదర్శకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. ఈ మార్గదర్శకాలను అన్ని హైకోర్టులు, జిల్లా కోర్టులు, రాష్ట్ర న్యాయ సేవా సంస్థలు (ఎస్ఎల్ఎస్ఏలు), రాష్ట్ర న్యాయశాఖలు, ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్లకు వెంటనే పంపించాలని సూచించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. లైంగిక నేరాల కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు అనుసరించాల్సిన విధానాలపై పోలీసు అధికారులకు కూడా ప్రత్యేక అవగాహన కల్పించాలని, ప్రాసిక్యూషన్ డైరెక్టరేట్లు ఈ మార్గదర్శకాలను సంబంధిత అధికారులందరికీ చేరవేయాలని ఆదేశించింది.

అద్భుతమైన నివేదిక..

భోపాల్‌లోని నేషనల్ జ్యుడీషియల్ అకాడమీ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ రూపొందించిన నివేదికను ప్రధాన న్యాయమూర్తి ప్రశంసించారు. ఇది న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలిచే అత్యుత్తమ కృషి అని పేర్కొంటూ కమిటీ సభ్యులను అభినందించారు. 2025లో అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పుపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. మైనర్‌పై లైంగిక దాడి ఘటనను అత్యాచార యత్నంగా కాకుండా సన్నాహక చర్యగా పేర్కొన్న ఆ తీర్పును సుప్రీంకోర్టు రద్దు చేసి, నిందితుడిపై పోక్సో చట్టం కింద అత్యాచార యత్నం అభియోగాన్ని పునరుద్ధరించింది. లైంగిక నేరాల బాధితులపై అవమానకరమైన పదజాలం, అసున్నిత వ్యాఖ్యలు, అవహేళనకు తావు లేకుండా న్యాయ ప్రక్రియ కొనసాగాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. బాధితుల గౌరవాన్ని కాపాడుతూ మహిళలు, చిన్నారుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెంపొందించడమే ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

ప్రభుత్వాన్ని విమర్శించడం దేశంపై యుద్ధం కాదు

పుణె: ప్రభుత్వాన్ని లేదా ముఖ్యమంత్రిని విమర్శించడం మాత్రమే దేశంపై యుద్ధం చేసినట్లుగా పరిగణించలేమని పుణె సెషన్స్ కోర్టు పేర్కొంది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) సోషల్ మీడియా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మహాదేవ్ బల్గుదేకు బెయిల్ మంజూరు చేస్తూ కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. దేవేంద్ర ఫడ్నవీస్‌కు సంబంధించిన మార్ఫింగ్ ఫొటోలు, నక్సలైట్లకు అనుకూల పోస్టులు పెట్టారనే ఆరోపణలతో బల్గుదేపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 152 సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. అయితే దేశ సార్వభౌమత్వానికి ముప్పు కలిగించే చర్యలకు పాల్పడినట్లు ఎలాంటి ఆధారాలు లేవని కోర్టు పేర్కొంది. దర్యాప్తు పూర్తై చార్జిషీట్ దాఖలైనందున రూ.25 వేల వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్ మంజూరు చేసింది. సాక్ష్యాలను ప్రభావితం చేయరాదని, కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని షరతులు విధించింది.

భర్త జీతంలో 25శాతం భరణం తప్పనిసరి కాదు

ప్రయాగ్‌రాజ్: భర్త నికర వేతనంలో 25 శాతం మొత్తాన్ని భార్యకు భరణంగా ఇవ్వడం తప్పనిసరి కాదని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అది కేవలం సాధారణ మార్గదర్శకం మాత్రమేనని, ప్రతి కేసులోని పరిస్థితులను బట్టి కోర్టులు ఎక్కువ లేదా తక్కువ భరణాన్ని నిర్ణయించే స్వేచ్ఛ కలిగి ఉంటాయని జస్టిస్ అచల్ సచ్‌దేవ్ పేర్కొన్నారు. భరణం ఉద్దేశం భార్య కేవలం జీవించడం కాదు, గౌరవంగా జీవించేలా చేయడమేనని కోర్టు వ్యాఖ్యానించింది. విడాకులు మంజూరైనా, భార్యకు స్వంత ఆదాయం లేకపోతే, మరో వివాహం చేసుకోకపోతే లేదా వ్యభిచార జీవితం గడపకపోతే భరణం పొందే హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. నెలకు రూ.86,674 స్థూల వేతనం పొందుతున్న భర్త కేసులో కుటుంబ న్యాయస్థానం నిర్ణయించిన రూ.12 వేల భరణం తగినది కాదని హైకోర్టు పేర్కొంది. భర్త వాస్తవ ఆదాయం, పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని నెలవారీ భరణాన్ని రూ.20 వేలకు పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది.

ఎలాన్ మస్క్‌కు ఎన్నికల చట్టం ఉచ్చు?

- ఓటర్లకు మిలియన్ డాలర్ల చెక్కుల వ్యవహారంపై దర్యాప్తునకు ఆదేశం
- విస్కాన్సిన్ ఎన్నికల కమిషన్ ప్రాథమికంగా నిబంధనల ఉల్లంఘనపై అనుమానం
- జిల్లా అటార్నీకి ఫిర్యాదులు బదిలీ
- 40 రోజుల్లో నివేదిక కోరిన కమిషన్

మాడిసన్: టెస్లా సీఈఓ, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అమెరికాలోని విస్కాన్సిన్ రాష్ట్ర సుప్రీంకోర్టు ఎన్నికల సందర్భంగా ఓటర్లకు ఒక్కొక్కరికి 10 లక్షల డాలర్ల (1 మిలియన్ డాలర్లు) చెక్కులు పంపిణీ చేయడం ద్వారా రాష్ట్ర ఎన్నికల చట్టాన్ని ఉల్లంఘించి ఉండవచ్చని విస్కాన్సిన్ ఎన్నికల కమిషన్ ప్రాథమికంగా నిర్ధారించింది. ఈ వ్యవహారంపై నమోదైన రెండు ఫిర్యాదులను తదుపరి దర్యాప్తు కోసం బ్రౌన్ కౌంటీ జిల్లా అటార్నీ కార్యాలయానికి పంపిస్తూ, 40 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించింది. మూడు డెమోక్రాట్లు, మూడు రిపబ్లికన్ సభ్యులతో కూడిన విస్కాన్సిన్ ఎన్నికల కమిషన్ గోప్య సమావేశంలో 5–1 ఓట్ల మెజారిటీతో ఈ నిర్ణయం తీసుకుంది. ఓటర్లను నగదు ప్రలోభాలతో ప్రభావితం చేయడం రాష్ట్ర ఎన్నికల లంచం నిరోధక చట్టానికి విరుద్ధమయ్యే అవకాశముందని కమిషన్ అభిప్రాయపడింది.

భారీగా ఖర్చు

విస్కాన్సిన్ సుప్రీంకోర్టు ఎన్నికల్లో రిపబ్లికన్ మద్దతు ఉన్న అభ్యర్థి బ్రాడ్ షిమెల్‌కు అనుకూలంగా మస్క్, ఆయన మద్దతు ఉన్న సంస్థలు కనీసం 2 కోట్ల డాలర్లు వ్యయం చేశాయి. అయితే డెమోక్రాటిక్ అభ్యర్థి సుసాన్ క్రాఫోర్డ్ విజయం సాధించారు. మొత్తం ఎన్నికల వ్యయం 10 కోట్ల డాలర్లను దాటడంతో ఇది అమెరికా చరిత్రలోనే అత్యంత ఖరీదైన న్యాయమూర్తుల ఎన్నికగా నిలిచింది. ఎన్నికలకు ముందు గ్రీన్‌బేలో జరిగిన సభలో మస్క్ ముగ్గురు ఓటర్లకు వ్యక్తిగతంగా 10 లక్షల డాలర్ల చెక్కులు అందజేశారు. అలాగే తన రాజకీయ చర్యల కమిటీ (అమెరికా పీఏసీ) ద్వారా ఒక పిటిషన్‌పై సంతకం చేసిన వారికి, ఇతరులతో సంతకం చేయించిన వారికి 100 డాలర్లు ఇస్తామని ప్రకటించారు. ఓటింగ్‌ను ప్రోత్సహించే పేరిట చేసిన ఈ ప్రకటన ఎన్నికల చట్ట ఉల్లంఘన కిందకు వచ్చే అవకాశం ఉందని కమిషన్ భావిస్తోంది.

మరో కేసు పెండింగ్

ఈ వ్యవహారంపై మస్క్ ప్రతినిధులు స్పందించలేదు. అయితే గతంలో కోర్టుకు సమర్పించిన పత్రాల్లో నగదు బహుమతులు ఇవ్వడం తన భావ ప్రకటన స్వేచ్ఛలో భాగమేనని, అది ఏ అభ్యర్థికి అనుకూలంగా ఓటేయాలని ప్రోత్సహించడం కాదని ఆయన తరఫు న్యాయవాదులు వాదించారు. ఇదే అంశంపై విస్కాన్సిన్ డెమోక్రసీ క్యాంపెయిన్ దాఖలు చేసిన మరో సివిల్ కేసు కూడా ప్రస్తుతం బ్రౌన్ కౌంటీ కోర్టులో విచారణలో ఉంది.

దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా ఖజురహో

- జాతీయ కస్టమర్ సంతృప్తి సూచీలో అగ్రస్థానం
- భోపాల్‌లోని రాజాభోజ్‌కు మూడో స్థానం
- ప్రయాణికుల అభిప్రాయాల ఆధారంగా ఏఏఐ ర్యాంకింగ్స్ విడుదల

खजुराहो हवाई अड्डे पर आपका स्वागत है
WELCOME TO KHAJURAHO AIRPORT

భోపాల్: భారత విమానాశ్రయాల అథారిటీ (ఏఏఐ) విడుదల చేసిన 2026 జాతీయ కస్టమర్ సంతృప్తి సూచీ (నేషనల్ కస్టమర్ సాటిస్‌ఫాక్షన్ ఇండెక్స్)లో మధ్యప్రదేశ్‌కు చెందిన ఖజురహో విమానాశ్రయం దేశంలోనే అత్యుత్తమ విమానాశ్రయంగా నిలిచింది. రాష్ట్ర రాజధాని భోపాల్‌లోని రాజా భోజ్ విమానాశ్రయం మూడో స్థానాన్ని దక్కించుకోవడంతో మధ్యప్రదేశ్ విమానయాన రంగానికి మరో గుర్తింపు లభించింది. ప్రయాణికులకు అందిస్తున్న సేవల నాణ్యత, పరిశుభ్రత, భద్రత, సౌకర్యాలు, సిబ్బంది స్పందన తదితర అంశాల్లో అత్యుత్తమ పనితీరు కనబర్చినందుకే ఖజురహో విమానాశ్రయం తొలి స్థానంలో నిలిచినట్లు ఏఏఐ వెల్లడించింది. ఒకే రాష్ట్రానికి చెందిన రెండు విమానాశ్రయాలు దేశవ్యాప్తంగా తొలి మూడు స్థానాల్లో నిలవడం విశేషమని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖజురహో విమానాశ్రయ డైరెక్టర్ సంతోష్ సింగ్ మాట్లాడుతూ.. సిబ్బంది సమష్టి కృషి, ప్రయాణికుల విశ్వాసం, నాణ్యమైన సేవలందించాలనే నిబద్ధతతో ఈ ఘనత సాధ్యమైందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ ప్రమాణాలతో మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

సర్వే ఆధారంగానే ర్యాంకులు

దేశవ్యాప్తంగా విమానాశ్రయాలను వినియోగించిన ప్రయాణికుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా ఈ ర్యాంకులను రూపొందించినట్లు ఏఏఐ తెలిపింది. చెక్–ఇన్ సేవలు, భద్రతా తనిఖీలు, టెర్మినల్ పరిశుభ్రత, సిబ్బంది వ్యవహారశైలి, నిరీక్షణ సమయం, ఆహార సేవలు, సమాచార వ్యవస్థలు, మొత్తం ప్రయాణ అనుభవం వంటి పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకింగ్ ఇచ్చినట్లు వెల్లడించింది. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన ఖజురహో దేవాలయాలను సందర్శించే దేశీయ, విదేశీ పర్యాటకులకు నాణ్యమైన విమానాశ్రయ సేవలు అందుబాటులోకి రావడం వల్ల ఈ ప్రాంత పర్యాటక రంగానికి మరింత ఊతం లభిస్తుందని విమానాశ్రయ అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యుత్ సహకారంపై భారత్-నేపాల్ చర్చలు

- సరిహద్దు విద్యుత్ వాణిజ్యం, జలవిద్యుత్ అభివృద్ధి, ఇంధన భద్రతపై దృష్టి
- ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయం

ఖాట్మండు: భారత్, నేపాల్ దేశాలు ఇంధన రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించేందుకు కీలక చర్చలు జరిపాయి. నేపాల్ ఇంధన, జలవనరులు, నీటిపారుదల శాఖ మంత్రి బిరాజ్ భక్త శ్రేష్ఠ, భారత విద్యుత్ శాఖ కార్యదర్శి పంకజ్ అగర్వాల్, అదనపు విదేశాంగ కార్యదర్శి మును మహావర్‌లతో మంగళవారం ఖాట్మండులో సమావేశమయ్యారు. సరిహద్దు విద్యుత్ వాణిజ్యం, విద్యుత్ ప్రసార వ్యవస్థల అనుసంధానం, జలవిద్యుత్ ప్రాజెక్టుల అభివృద్ధి, ప్రాంతీయ ఇంధన భద్రత వంటి అంశాలపై ఇరు దేశాల ప్రతినిధులు విస్తృతంగా చర్చించారు. పరస్పర ప్రయోజనాలు, స్థిరమైన ఇంధనాభివృద్ధి లక్ష్యంగా ఇంధన రంగంలో సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరు దేశాలు పునరుద్ఘాటించాయి

రాహుల్ సభకు అనుమతి రద్దు

- డెహ్రాడూన్‌లో రాజకీయ దుమారం
- ప్రభుత్వ ఒత్తిడితోనే నిర్ణయమని కాంగ్రెస్ ఆరోపణ
- బన్నూ స్కూల్ మైదానంలో సభ నిర్వహణ

డెహ్రాడూన్: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పాల్గొననున్న ఛాత్రోన్ కీ గూంజ్ (విద్యార్థుల గొంతుక) కార్యక్రమానికి డెహ్రాడూన్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఇచ్చిన అనుమతిని జిల్లా యంత్రాంగం ఉపసంహరించుకోవడంతో ఉత్తరాఖండ్‌లో రాజకీయ వివాదం నెలకొంది. అనుమతి రద్దును నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు మంగళవారం రాత్రి పరేడ్ గ్రౌండ్‌లో ధర్నా చేపట్టారు. అనంతరం కార్యక్రమాన్ని బన్నూ స్కూల్ మైదానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించింది. ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోడియాల్ నేతృత్వంలో జరిగిన నిరసనలో ప్రతిపక్ష నేత యశ్‌పాల్ ఆర్య, హరక్‌సింగ్ రావత్, ప్రీతమ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు. జూలై 15 నుంచి 17 వరకు సభ నిర్వహించేందుకు ముందే అనుమతి ఇచ్చి, తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో దానిని రద్దు చేశారని గోడియాల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ సభకు ప్రభుత్వం భయపడుతోందనేందుకు ఇదే నిదర్శనమని విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ చౌహాన్ మాత్రం ఈ ఆరోపణలను ఖండించారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న లోక్ సంవర్ధన్ పర్వ్ కార్యక్రమాన్ని జూలై 17 వరకు పొడిగించడంతో పరేడ్ గ్రౌండ్ అందుబాటులో లేకపోయిందని తెలిపారు. దీంతో కాంగ్రెస్‌కు బన్నూ స్కూల్ మైదానం సహ ప్రత్యామ్నాయ వేదికలను సూచించినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయం పూర్తిగా పరిపాలనా, నిర్వహణాపరమైన కారణాలతో తీసుకున్నదేనని, రాజకీయ ఉద్దేశాలు లేవని స్పష్టం చేశారు.

విద్యార్థులతో ముఖాముఖి

ఛాత్రోన్ కీ గూంజ్ కార్యక్రమంలో భాగంగా రాహుల్ గాంధీ విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించనున్నారు. పరీక్షల నిర్వహణలో సంస్కరణలు, ప్రశ్నపత్రాల లీకులు, నిరుద్యోగం వంటి అంశాలపై కాంగ్రెస్ చేపట్టిన దేశవ్యాప్త 40 రోజుల ప్రచార కార్యక్రమంలో భాగంగానే ఈ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ తెలిపింది. రాహుల్ పర్యటన ఏర్పాట్ల కోసం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు కాంగ్రెస్ నాయకత్వం వెల్లడించింది.

అకాల రథయాత్ర శాస్త్రసమ్మతం కాదు

- ఇస్కాన్ వాదనలను ఖండించిన పూరీ జగన్నాథ ఆలయ కమిటీ
- ఇది భక్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శ

భువనేశ్వర్: వివిధ దేశాల్లో ఏడాది పొడవునా నిర్వహిస్తున్న అకాల రథయాత్రలు శాస్త్రసమ్మతమేనన్న ఇస్కాన్ వాదనను పూరీ శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన (ఎస్‌జేటీఏ) మంగళవారం తీవ్రంగా ఖండించింది. నిర్ణీత తిథులు కాకుండా యాదృచ్ఛిక రోజుల్లో రథయాత్ర నిర్వహించడం శాస్త్రాలకు విరుద్ధమని, ప్రపంచవ్యాప్తంగా భక్తులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని పేర్కొంది. ఇస్కాన్ విడుదల చేసిన ప్రకటనలోని వ్యాఖ్యలు అసత్యమని ఎస్‌జేటీఏ తెలిపింది. విదేశాల్లో వివిధ తేదీల్లో రథయాత్ర నిర్వహించడాన్ని శాస్త్రాలు అనుమతిస్తాయన్న వాదనను ఆలయ పండితులు ఇప్పటికే తిరస్కరించారని వెల్లడించింది. 2025 మార్చి 20న భువనేశ్వర్‌లో ఇస్కాన్, ఆలయ పండితుల మధ్య జరిగిన సమావేశంలో కూడా పురాణాలు, శాస్త్రాల ఆధారంగా ఇస్కాన్ వాదనను ఖండించినట్లు పేర్కొంది.

గజపతి మహారాజు పేరును వాడొద్దు

పూరీ గజపతి మహారాజు దిబ్యసింగ్ దేవ్ అకాల రథయాత్రలకు మద్దతిచ్చినట్లు ఇస్కాన్ పరోక్షంగా ప్రచారం చేయడం తప్పుడు చర్య అని ఎస్‌జేటీఏ విమర్శించింది. ఇది గజపతి మహారాజు ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నమని పేర్కొంది. మరోవైపు, ఎస్‌జేటీఏ ప్రకటనపై స్పందించేందుకు ఇస్కాన్ జాతీయ ప్రతినిధి యుధిష్ఠిర్ గోవింద దాస్ నిరాకరించారు. పూర్తి ప్రకటనను పరిశీలించిన తర్వాతే స్పందిస్తామని తెలిపారు.

అక్టోబర్‌లో ఏఐ–171 ప్రమాద తుది నివేదిక

సుప్రీంకోర్టుకు వెల్లడించిన ఏఏఐబీ

న్యూఢిల్లీ: అహ్మదాబాద్‌లో 2025 జూన్ 12న జరిగిన ఎయిర్ ఇండియా ఏఐ–171 విమాన ప్రమాదంపై తుది దర్యాప్తు నివేదిక ముసాయిదా అక్టోబర్ 2026 నాటికి సిద్ధమయ్యే అవకాశముందని విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) సుప్రీంకోర్టుకు తెలిపింది. దర్యాప్తు పురోగతిపై దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రమాదానికి సంబంధించిన కాక్‌పిట్ వాయిస్ రికార్డులు, విమానంలోని దృశ్య రికార్డులు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సంభాషణలు, సాక్షుల వాంగ్మూలాలు వంటి కీలక ఆధారాలను చట్టపరంగా గోప్యంగా ఉంచాల్సి ఉంటుందని ఏఏఐబీ స్పష్టం చేసింది. ఐసీఏఓ నిబంధనలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో దర్యాప్తు కొనసాగుతోందని, ఎవరిపై నిందారోపణ చేయడం కాకుండా భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రతా చర్యలను మెరుగుపరచడమే విచారణ ప్రధాన ఉద్దేశమని తెలిపింది. 2025 జూన్ 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఈ ఘోర ప్రమాదంలో మొత్తం 260 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

తిరుగుబాటు ఎంపీలకు లీగల్ నోటీసులు

- షిండే శివసేనలో విలీనం చట్టబద్ధం కాదన్న ఉద్ధవ్ వర్గం
- నోటీసులను చెత్తబుట్టలో పడేశామన్న ఏక్‌నాథ్ షిండే

ముంబై: శివసేన (యూబీటీ) నుంచి షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఆరుగురు లోక్‌సభ ఎంపీలకు ఉద్ధవ్ ఠాక్రే వర్గం లీగల్ నోటీసులు జారీ చేసింది. అసలు రాజకీయ పార్టీ విలీనం కాకుండా శాసనసభా పక్షం విలీనం చట్టబద్ధం కాదని పార్టీ పార్లమెంటరీ నేత అరవింద్ సావంత్ నోటీసుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్‌కు కూడా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ నోటీసులపై ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పందిస్తూ.. ఎంపీలు ఇప్పటికే లోక్‌సభ స్పీకర్‌ను కలిసి అవసరమైన పత్రాలు సమర్పించారని, అన్ని చట్టపరమైన ప్రక్రియలు పూర్తయ్యాయని చెప్పారు. ఆ లేఖలను మా ఎంపీలు చెత్తబుట్టలో పడేశారు. వాటికి ఎలాంటి ప్రాధాన్యం లేదు అని వ్యాఖ్యానించారు. ఇదిలాఉంటే షిండే శివసేనలో చేరిన ఆరుగురు ఎంపీలు మంగళవారం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. తమ నియోజకవర్గాల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు శివసేన వెల్లడించింది.

ఎంఏడీసీఎల్‌కు ఎదురుదెబ్బ

- ఆస్తుల విక్రయానికి ఎన్‌సీఎల్ఏటీ గ్రీన్‌సిగ్నల్
- ర్యాంకిని పవర్‌కు ఆస్తుల విక్రయం చెల్లుబాటేనని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: నాగ్‌పూర్‌లోని అభిజీత్ ఎంఏడీసీ నాగ్‌పూర్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎంఎన్ఈపీఎల్) ఆస్తుల విక్రయాన్ని సవాల్ చేస్తూ మహారాష్ట్ర ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఎంఏడీసీఎల్) దాఖలు చేసిన రెండు అప్పీళ్లను నేషనల్ కంపెనీ లా అప్పిలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) కొట్టివేసింది. లిక్విడేషన్ ప్రక్రియలో భాగంగా సంస్థ లీజు హక్కులతో కూడిన ఆస్తులను విక్రయించే అధికారం లిక్విడేటర్‌కు ఉందని స్పష్టం చేసింది. రెండు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పులో.. భూమికి యజమాని అయినందున ఆస్తుల విక్రయాన్ని అడ్డుకునే హక్కు తమకు ఉందన్న ఎంఏడీసీఎల్ వాదనను తిరస్కరించింది. లీజు హక్కులు కూడా దివాలా చట్టం పరిధిలో ఆస్తులుగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొంది. ముంబై బెంచ్ నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) 2024 మార్చి 13న ఇచ్చిన తీర్పును ఎన్‌సీఎల్ఏటీ సమర్థించింది. విజయవంతమైన వేలం కొనుగోలుదారుడికి జారీ చేసిన సేల్ సర్టిఫికెట్‌ను సమర్థిస్తూ ఎన్‌సీఎల్‌టీ ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపింది.

బీఓటీ ఒప్పందాల హక్కులు కొనసాగుతాయి

అయితే బిల్డ్–ఆపరేట్–ట్రాన్స్‌ఫర్ (బీఓటీ) ఒప్పందాల ప్రకారం ఎంఏడీసీఎల్‌కు ఉన్న హక్కులు కొనసాగుతాయని ఎన్‌సీఎల్ఏటీ స్పష్టం చేసింది. వేలంలో ఆస్తులను కొనుగోలు చేసిన సంస్థ కూడా ఒప్పంద నిబంధనలకు అనుగుణంగానే సదుపాయాలను బదిలీ చేయాల్సి ఉంటుందని పేర్కొంది. మిహాన్ ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్)కు విద్యుత్ సరఫరా కోసం ఏఎంఏడీసీ నాగ్‌పూర్ ఎనర్జీ సంస్థను ఏర్పాటు చేశారు. ఇందులో ఎంఏడీసీఎల్‌కు 26 శాతం వాటా ఉంది. 2017 అక్టోబర్‌లో సంస్థ దివాలా ప్రక్రియలోకి వెళ్లగా, 2018 ఆగస్టులో లిక్విడేషన్‌కు తరలించారు. అనంతరం 2020 డిసెంబర్‌లో సంస్థ వ్యాపార కార్యకలాపాలు, ఆస్తులను బహిరంగ వేలాల ద్వారా రూ.100 కోట్లకు పైగా మొత్తానికి విక్రయించారు.

దివాలా చట్టం నిబంధనల ఆధారంగా తీర్పు

దివాలా చట్టంలోని సెక్షన్ 3(27), 18(1)(ఎఫ్) ప్రకారం లీజు హక్కులు కూడా ఆస్తుల పరిధిలోకి వస్తాయని ఎన్‌సీఎల్ఏటీ పేర్కొంది. అందువల్ల వాటిని లిక్విడేషన్ ఎస్టేట్‌లో చేర్చడం చట్టబద్ధమేనని తెలిపింది. ఎంఏడీసీఎల్ 26 శాతం ఈక్విటీ వాటాను లీజు ప్రీమియం కోసం పరిగణించారని, ఒప్పంద కాలం ముగిసిన తర్వాత నిబంధనల ప్రకారం బదిలీ చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్

- అర్ధ సెంచరీలతో రాణించిన అక్షర్, వాషింగ్టన్
- వన్డే సిరీస్‌లో భారత్‌కు శుభారంభం
- తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్‌పై ఆరు వికెట్ల ఘన విజయం

బర్మింగ్‌హామ్: కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరోసారి ఎడ్జ్‌బాస్టన్‌లో తనకు తిరుగులేదని నిరూపించాడు. అతడి ఆకర్షణీయమైన 80 పరుగుల ఇన్నింగ్స్‌కు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ అజేయ అర్ధసెంచరీలు జతకావడంతో తొలి వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యం సాధించింది. ఇంగ్లండ్ పర్యటనలో భారత్‌కు ఇదే తొలి విజయం కావడం విశేషం. 259 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు శుభ్‌మన్ గిల్ (80) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో విజయానికి బాటలు వేశాడు. 75 బంతుల్లో 11 ఫోర్లు, ఒక సిక్సర్‌తో ఆకట్టుకున్న గిల్.. శ్రేయస్ అయ్యర్ (35)తో కలిసి మూడో వికెట్‌కు 101 పరుగులు జోడించాడు. సెంచరీ దిశగా సాగుతున్న సమయంలో కాలి కండరాల నొప్పితో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. గిల్ నిష్క్రమణ తర్వాత భారత్ 160/4తో కాస్త ఒత్తిడిలో పడినా, అక్షర్ పటేల్ (57 నాటౌట్), వాషింగ్టన్ సుందర్ (52 నాటౌట్) అసాధారణ స్థైర్యం ప్రదర్శించారు. ఐదో వికెట్‌కు అజేయంగా 102 పరుగులు జోడించి మరో 28 బంతులు మిగిలి ఉండగానే జట్టును విజయతీరాలకు చేర్చారు. భారత్ 45.2 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

రూట్, డాసన్ పోరాటం

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 49.2 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. ఒక దశలో 107/6తో కష్టాల్లో పడిన ఆ జట్టును జో రూట్ (76), లియామ్ డాసన్ (68) ఏడో వికెట్‌కు 121 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకున్నారు. వీరి పోరాటంతో ఇంగ్లాండ్ పోటీ లక్ష్యాన్ని నిర్దేశించగలిగింది. భారత బౌలర్లలో అక్షర్ పటేల్ నాలుగు వికెట్లు తీసి ఇంగ్లాండ్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చడంలో కీలక పాత్ర పోషించాడు. గుర్నూర్ బ్రార్, ప్రసిద్ధ్ కృష్ణ తలో రెండు వికెట్లు పడగొట్టగా, జస్ప్రీత్ బుమ్రా కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఒక వికెట్ సాధించాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేసిన అక్షర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఫైనల్‌కు స్పెయిన్

- ఫ్రాన్స్‌పై 2–0 గోల్స్‌తో ఘన విజయం

ఆర్లింగ్టన్ (టెక్సాస్): ఫిఫా ప్రపంచకప్‌లో స్పెయిన్ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో ఫ్రాన్స్‌ను 2–0 గోల్స్‌తో ఓడించి 2010 తర్వాత తొలిసారి ప్రపంచకప్ ఫైనల్‌లో అడుగుపెట్టింది. 22వ నిమిషంలో లమిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో లభించిన పెనాల్టీని మికెల్ ఒయర్‌జబాల్ గోల్‌గా మలిచాడు. అనంతరం 58వ నిమిషంలో డానీ ఒల్మో ఇచ్చిన అద్భుత పాస్‌ను పెడ్రో పోరో గోల్‌గా మార్చి స్పెయిన్‌కు 2–0 ఆధిక్యం అందించాడు. 19 ఏళ్లు పూర్తి చేసుకున్న లమిన్ యమాల్ మరో గోల్ చేసినా ఆఫ్‌సైడ్‌గా ప్రకటించడంతో అది లెక్కలోకి రాలేదు. ఫిఫా అగ్రశ్రేణి జట్టు ఫ్రాన్స్‌ను నిలువరించిన స్పెయిన్ ఇప్పుడు ఆదివారం జరిగే ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ అర్జెంటీనా–ఇంగ్లండ్ సెమీఫైనల్ విజేతతో తలపడనుంది. ఓడిన ఫ్రాన్స్ మూడో స్థానం కోసం మ్యాచ్ ఆడనుంది.

తారలతో సందడి

- ప్రపంచకప్ ముగింపు వేడుకలకు సిద్ధమైన న్యూజెర్సీ స్టేడియం

న్యూయార్క్: ఫిఫా ప్రపంచకప్–2026 ముగింపు వేడుకలు ఆదివారం న్యూజెర్సీలోని స్టేడియంలో కనులపండువగా జరగనున్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముందు నిర్వహించే ఈ వేడుకల్లో హాలీవుడ్ స్టార్ టామ్ క్రూయిజ్‌తో పాటు ప్రముఖ గాయని లారా పౌసిని, నికోల్ షెర్జింగర్, రాబీ విలియమ్స్, ప్రముఖ డిజిటల్ క్రియేటర్ ఐషోస్పీడ్ తదితరులు ప్రత్యేక ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించనున్నారు. అమెరికా జాతీయ గీతాన్ని ఎమ్మీ, గ్రామీ, ఆస్కార్, టోనీ అవార్డు గ్రహీత జెన్నిఫర్ హడ్సన్ ఆలపించనుండగా, ఈ ప్రదర్శనతో ప్రపంచకప్ ఫైనల్‌కు ఘన ఆరంభం లభించనుందని ఫిఫా వెల్లడించింది. కెనడా, మెక్సికో, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యం ఇచ్చిన ఈ చారిత్రక టోర్నీలో 16 నగరాల్లో 48 జట్లు పోటీపడ్డాయి. ఆ ప్రయాణాన్ని సంగీతం, సంస్కృతి, ఫుట్‌బాల్ సమ్మేళనంగా ముగింపు వేడుకల్లో ఆవిష్కరించనున్నట్లు ఫిఫా తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులను అలరించిన ఈ టోర్నీకి ముగింపు వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

రెండో రౌండ్‌కు సింధు

- జపాన్ ఓపెన్ తొలి రౌండ్‌లో లింగ్ చింగ్‌పై విజయం
- భుజం గాయంతో మధ్యలోనే వైదొలిగిన సాత్విక్–చిరాగ్ జోడీ
- మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్–తనిషా జంట ముందంజ

టోక్యో: జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు విజయంతో రెండో రౌండ్‌కు చేరుకుంది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌ను 21–14, 21–11తో వరుస గేమ్‌ల్లో ఓడించింది. భారత అగ్రశ్రేణి పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి–చిరాగ్ శెట్టి భుజం గాయం కారణంగా తొలి రౌండ్ మ్యాచ్ మధ్యలోనే వైదొలిగింది. డెన్మార్క్‌కు చెందిన డానియెల్ లుండ్‌గార్డ్–మాడ్స్ వెస్టర్‌గార్డ్ జోడీతో తొలి గేమ్‌ను 19–21తో కోల్పోయిన తర్వాత మ్యాచ్‌ను కొనసాగించలేదు. దీంతో వచ్చే వారం జరిగే చైనా ఓపెన్‌కు కూడా దూరమవుతున్న ఈ జోడీ, ఆగస్టులో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్‌కు సిద్ధమవుతుందని కోచ్ టాన్ కిమ్ హెర్ తెలిపారు. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలా–తనిషా క్రాస్టో జోడీ స్కాట్లాండ్‌కు చెందిన అలెగ్జాండర్ డన్–జూలీ మాక్‌ఫెర్సన్‌పై 21–16, 21–14తో విజయం సాధించి రెండో రౌండ్‌కు చేరుకుంది. మరోవైపు రోహన్ కపూర్–రుత్విక శివాని గద్దే జోడీ తొలి రౌండ్‌లోనే పరాజయం పాలైంది.

విండీస్‌పై కివీస్ ఘన విజయం

గయానా: వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ బలంగా పుంజుకుంది. రెండో వన్డేలో ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 1–1తో సమం చేసింది. ఎడమచేతి స్పిన్నర్ జేడెన్ లెనాక్స్ (5/19) అద్భుత బౌలింగ్‌తో వెస్టిండీస్‌ను 138 పరుగులకే కుప్పకూల్చాడు. 63 పరుగుల వద్ద వికెట్ కోల్పోని స్థితిలో ఉన్న వెస్టిండీస్ ఆ తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయి 138 పరుగులకే ఆలౌటైంది. జాన్ క్యాంప్‌బెల్ (43), అమీర్ జంగూ (24) మాత్రమే కొంత పోరాడగా, లెనాక్స్‌తో పాటు మిచెల్ శాంట్నర్ కీలక వికెట్లు తీశారు. 139 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో న్యూజిలాండ్ 96/5తో ఒత్తిడిలో పడింది. అయితే టామ్ లాథమ్ (37 నాటౌట్), మార్క్ బ్రేస్‌వెల్ (18 నాటౌట్) అజేయ భాగస్వామ్యంతో జట్టును విజయతీరానికి చేర్చారు.

క్రూడాయిల్ సెగ.. కుదేలైన మార్కెట్లు

- 561 పాయింట్లు పతనమైన సెన్సెక్స్.. 159 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ
- రూ.3 లక్షల కోట్లు ఆవిరి
- ప్రతికూల ప్రభావం చూపిన ఇరాన్–అమెరికా ఉద్రిక్తత
- వడ్డీ రేట్ల భయాలతో ఇన్వెస్టర్ల అప్రమత్తం

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు మళ్లీ పెరగడం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో కొనసాగుతాయన్న ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో పాటు ఆటో, ఫైనాన్షియల్, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై ప్రభావం చూపింది. ఫలితంగా బీఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు రూ.3 లక్షల కోట్ల మేర తగ్గిపోయింది. సెన్సెక్స్ ఉదయం 77,272.34 పాయింట్ల వద్ద నష్టాలతో ప్రారంభమైంది. రోజంతా ఒడిదుడుకులకు లోనైన సూచీ.. ఒక దశలో 600 పాయింట్లకు పైగా పతనమై 77,001.48 పాయింట్ల కనిష్ఠ స్థాయిని తాకింది. చివరకు 561.46 పాయింట్లు నష్టపోయి 77,054.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 158.95 పాయింట్లు క్షీణించి 24,052.05 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 96.22 స్థాయిలో కొనసాగింది. సెన్సెక్స్ 30 షేర్లలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో షేర్లు నష్టాలను చవిచూశాయి. అయితే భారతీ ఎయిర్‌టెల్, సన్ ఫార్మా, టాటా స్టీల్, టీసీఎస్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభాల్లో ముగిశాయి.

చమురు ధరల పెరుగుదలతో ఆందోళన

ఇరాన్–అమెరికా మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. అంతర్జాతీయంగా చమురు సరఫరాకు ఆటంకాలు ఏర్పడే అవకాశం ఉందన్న అంచనాలతో ముడిచమురు ధరలు భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర బ్యారెల్‌కు 87 డాలర్ల స్థాయికి చేరడం మార్కెట్ వర్గాలను ఆందోళనకు గురిచేసింది. భారత్ వంటి చమురు దిగుమతి ఆధారిత దేశాలపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని ఇన్వెస్టర్లు భావించారు.

రూపాయి పతనం

- 48 పైసలు క్షీణించి 96.16 వద్ద ముగింపు

అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో రూపాయి విలువ మరింత బలహీనపడింది. మంగళవారం అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 48 పైసలు క్షీణించి 96.16 వద్ద ముగిసింది. పెరుగుతున్న ముడిచమురు ధరలు, ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు, డాలర్‌కు పెరిగిన డిమాండ్ దేశీయ కరెన్సీపై ఒత్తిడి పెంచాయి. అంతర్‌బ్యాంక్ విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి 95.95 వద్ద ప్రారంభమై, రోజులో కనిష్ఠంగా 96.33 స్థాయిని తాకింది. చివరకు 96.16 వద్ద స్థిరపడింది. సోమవారం కూడా రూపాయి 30 పైసలు నష్టపోయి 95.68 వద్ద ముగిసింది.

Business
బిజినెస్

టాటా ఎలెక్సీ లాభాల్లో 18% వృద్ధి

- జూన్ త్రైమాసికంలో రూ.170.6 కోట్ల నికర లాభం
- రూ.1,021 కోట్లకు చేరిన ఆదాయం

న్యూఢిల్లీ: డిజైన్, టెక్నాలజీ సేవల సంస్థ టాటా ఎలెక్సీ 2026–27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మెరుగైన ఫలితాలు నమోదు చేసింది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 18.17 శాతం పెరిగి రూ.170.59 కోట్లకు చేరింది. గతేడాది ఇదే కాలంలో ఇది రూ.144.36 కోట్లుగా ఉంది. కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 14.46 శాతం వృద్ధితో రూ.1,021.1 కోట్లకు పెరి గింది. గత ఏడాది రూ.892.09 కోట్లుగా నమోదైంది.

రవాణా, మీడియా విభాగాల్లో..

కీలక విభాగాల్లో వృద్ధి, పెద్ద ఒప్పందాల అమలు కారణంగా పనితీరు మెరుగుపడిందని కంపెనీ సీఈవో, ఎండీ మనోజ్ రాఘవన్ తెలిపారు. డిజైన్ ఆధారిత, ఏఐ ఆధారిత ఇంజినీరింగ్ సామర్థ్యాలు కంపెనీ వృద్ధికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. రవాణా విభాగం వార్షిక ప్రాతిపదికన 13.3 శాతం వృద్ధి నమోదు చేయగా.. మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం 22.2 శాతం వృద్ధిని సాధించింది. ఆటోమోటివ్ ఆదాయంలో ఓఈఎం సంస్థల వాటా 78 శాతానికి చేరినట్లు కంపెనీ తెలిపింది.

ఏఐపై పెట్టుబడులు

ఏఐ ఆధారిత సేవల విస్తరణ కోసం ప్రత్యేక నైపుణ్యాలు, ప్లాట్‌ఫామ్‌లు, టూల్స్, మౌలిక సదుపాయాలపై పెట్టుబడులు పెంచుతున్నట్లు టాటా ఎలెక్సీ వెల్లడించింది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి కంపెనీ ఉద్యోగుల సంఖ్య 11,336గా ఉంది.

బ్యాంక్ బోర్డు పాలన నిబంధనల్లో ఆర్‌బీఐ మార్పులు

- అక్టోబర్ 1 నుంచి కొత్త విధానం అమలు

ముంబై: బ్యాంకుల బోర్డు సమావేశాల నిర్వహణ, నిర్ణయాల ప్రక్రియకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక మార్పులు చేసింది. 'బ్యాంక్ బోర్డుల ముందు ఉంచాల్సిన అంశాలు' నిబంధనల్లో తుది సవరణలను మంగళవారం ప్రకటించింది. కొత్త నిబంధనలు ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ఆర్‌బీఐ తెలిపింది. కొత్త విధానంలో సూత్రాల ఆధారిత (ప్రిన్సిపుల్స్ బేస్డ్) విధానాన్ని అవలంబిస్తున్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. ప్రతి బ్యాంకు తన అవసరాలు, ప్రాధాన్యతలకు అనుగుణంగా బోర్డు సమావేశాల అజెండాను రూపొందించుకునే అవకాశం కల్పించింది. బ్యాంకుల రిస్క్ నిర్వహణ, నియంత్రణ అనుసరణ (కంప్లయెన్స్), ఆర్థిక పనితీరు, వినియోగదారుల రక్షణ వంటి కీలక అంశాలపై బోర్డు పర్యవేక్షణ మాత్రం కొనసాగుతుందనిఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే బోర్డు సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించిన విధానాన్ని బ్యాంకు బోర్డే నిర్ణయించుకోవచ్చని తెలిపింది. గతంలో ఉన్న 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' విధానాన్ని కొనసాగించాలన్న సూచనలను ఆర్‌బీఐ అంగీకరించలేదు.

మిల్‌వర్క్స్ టెక్నాలజీస్ ఐపీఓకు భారీ స్పందన

- రూ.160 కోట్ల ఇష్యూ 10.74 రెట్లు సబ్‌స్క్రైబ్
- రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి భారీ డిమాండ్.. రేపటి వరకు బిడ్డింగ్

న్యూఢిల్లీ: హై ప్రెసిషన్ మెషిన్డ్ కాంపోనెంట్ల తయారీ సంస్థ మిల్‌వర్క్స్ టెక్నాలజీస్ ఎస్ఎంఈ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. మంగళవారం ప్రారంభమైన పబ్లిక్ ఇష్యూలో ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున ఆసక్తి చూపడంతో మొత్తం ఇష్యూ 10.74 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కంపెనీ రూ.160.33 కోట్ల సమీకరణ లక్ష్యంతో తీసుకొచ్చిన ఎస్ఎంఈ ఐపీఓలో భాగంగా 30,94,800 షేర్లను ఆఫర్ చేసింది. దీనికి ప్రతిగా ఇన్వెస్టర్ల నుంచి 3,32,39,600 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. బీఎస్ఈ గణాంకాల ప్రకారం తొలిరోజు ముగిసే సమయానికి మొత్తం ఇష్యూకు 10.74 రెట్ల స్పందన నమోదైంది. ఐపీఓలో రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి అత్యధిక ఆసక్తి కనిపించింది. ఈ విభాగం 15.75 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా, నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల (ఎన్ఐఐ) విభాగం 13.38 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. అర్హత కలిగిన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ) విభాగానికి మాత్రం పరిమిత స్పందన లభించింది. మిల్‌వర్క్స్ టెక్నాలజీస్ ఐపీఓ బిడ్డింగ్ ప్రక్రియ జూలై 16న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.315 నుంచి రూ.331గా నిర్ణయించారు. షేర్లు బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై లిస్ట్ కానున్నాయి.

రక్షణ, ఏరోస్పేస్ రంగాలకు కీలక భాగాల తయారీ

బెంగళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మిల్‌వర్క్స్ టెక్నాలజీస్ మొత్తం 48.44 లక్షల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేస్తోంది. ధరల గరిష్ఠ స్థాయిలో కంపెనీకి రూ.160.33 కోట్ల నిధులు సమకూరనున్నాయి. ఐపీఓ ద్వారా వచ్చే నిధులను ప్లాంట్, యంత్రాల కొనుగోలు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, సాధారణ కార్పొరేట్ కార్యకలాపాలకు వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది. రైల్వేలు, ఏరోస్పేస్, రక్షణ, మెట్రో రైలు, డ్రోన్, సెమీకండక్టర్ రంగాలకు అవసరమైన హై ప్రెసిషన్ కాంపోనెంట్లు, అసెంబ్లీల తయారీలో మిల్‌వర్క్స్ టెక్నాలజీస్ ప్రత్యేకత సాధించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.148.76 కోట్ల ఆదాయాన్ని, రూ.37 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఈ ఐపీఓకు జీఆర్‌వై క్యాపిటల్ అడ్వైజర్స్ ఏకైక బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా వ్యవహరిస్తోంది.

ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ అథర్ ఎనర్జీ తన తొలి మాస్ మార్కెట్ ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆగస్టు 29న ఆవిష్కరించనుంది. బెంగళూరులో నిర్వహించే 'కమ్యూనిటీ డే–2026' కార్యక్రమంలో ఈ కొత్త మోడల్‌ను పరిచయం చేయనున్నట్లు సంస్థ మంగళవారం వెల్లడించింది. తదుపరి తరం వాహన ఆర్కిటెక్చర్ ఆధారంగా ఈ స్కూటర్‌ను అభివృద్ధి చేసినట్లు అథర్ తెలిపింది. 2016లో విడుదల చేసిన 450 ప్లాట్‌ఫామ్ తర్వాత సంస్థ రూపొందిస్తున్న తొలి కొత్త వాహన ప్లాట్‌ఫామ్ ఇదేనని పేర్కొంది. ఈ కొత్త ప్లాట్‌ఫామ్ భవిష్యత్‌లో వివిధ విభాగాల్లో వచ్చే అథర్ ఉత్పత్తులకు ఆధారంగా నిలుస్తుందని సంస్థ తెలిపింది.

ఏఐలో మహేశ్ రాముడు.. ఎన్టీఆర్ రావణుడు!

ప్రస్తుతం ఏఐ సాంకేతికత సోషల్ మీడియాలో సరికొత్త విజువల్స్‌తో సినీ అభిమానులను ఆకట్టుకుంటోంది. వెండితెరపై చూడాలని అభిమానులు కలలు కనే కాంబినేషన్లను ఏఐ ద్వారా సృష్టిస్తూ డిజిటల్ క్రియేటర్లు నెటిజన్లను ఆశ్చర్యపరుస్తున్నారు. తాజాగా టాలీవుడ్ స్టార్ హీరోలు మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్‌లను ప్రధాన పాత్రల్లో ఊహిస్తూ రూపొందించిన రామాయణ ఫ్యాన్ మేడ్ ఏఐ ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో మహేశ్ బాబును శ్రీరాముడి గా, జూనియర్ ఎన్టీఆర్‌ను రావణాసురుడిగా ఏఐ సాయంతో చూపించిన తీరు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. మహేశ్ బాబు రూపాన్ని శ్రీరాముడి పాత్రకు, ఎన్టీఆర్‌లోని గాంభీర్యాన్ని రావణుడి పాత్రకు అన్వయిస్తూ రూపొందించిన విజువల్స్‌కు నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. అలాగే కీర్తి సురేశ్‌ను సీతాదేవిగా, జాన్వీ కపూర్‌ను మండోదరిగా చూపిస్తూ రూపొందించిన సన్నివేశాలు కూడా ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా సీతాపహరణం, రాముడి ఆవేదన, రావణుడి అహంకారాన్ని ప్రతిబింబించే సన్నివేశాలను ఏఐ ద్వారా రూపొందించిన విధానం సినీ ప్రియులను ఆకర్షిస్తోంది. ఈ వీడియో అధికారిక సినిమా ట్రైలర్ కాకుండా అభిమానులు రూపొందించిన ఏఐ కాన్సెప్ట్ వీడియో మాత్రమే. ఇదిలా ఉండగా, దర్శకుడు నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం రామాయణ లో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతాదేవిగా నటిస్తున్నారు. కన్నడ స్టార్ యశ్ రావణాసురుడి పాత్రలో కనిపించనుండగా, సన్నీ డియోల్ హనుమంతుడిగా, కాజల్ అగర్వాల్ మండోదరిగా నటిస్తున్నారు. ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్, డిఎన్ఈజీ, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి హాలీవుడ్ సంగీత దిగ్గజం హాన్స్ జిమ్మర్, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. తొలి భాగాన్ని 2026 దీపావళి సందర్భంగా విడుదల చేయాలని చిత్ర బృందం ఇప్పటికే ప్రకటించింది. అలాగే అధికారిక ట్రైలర్‌ను జూలై 24 న విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. అసలు సినిమా ట్రైలర్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, మహేశ్ బాబు–ఎన్టీఆర్‌లను పౌరాణిక పాత్రల్లో ఊహిస్తూ రూపొందించిన ఈ ఫ్యాన్ మేడ్ ఏఐ ట్రైలర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

'తమన్నా'కు బాలీవుడ్‌లో బ్రేకులు!

ఒకప్పుడు టాలీవుడ్ అగ్రహీరోల సరసన వరుస చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన తమన్నా భాటియా ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాల కొరతను ఎదుర్కొంటున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దాదాపు రెండు దశాబ్దాల పాటు స్టార్ హీరోయిన్‌గా కొనసాగిన ఆమెకు ఇప్పుడు టాలీవుడ్‌లో కొత్త ప్రాజెక్టులు లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. ఇటీవల విడుదలైన ఓదెల 2 చిత్రంలో తమన్నా తొలిసారిగా అఘోరీ పాత్రలో నటించి ప్రశంసలు అందుకున్నప్పటికీ, సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాన్ని సాధించలేకపోయింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ చిత్రం కమర్షియల్‌గా నిరాశపరిచిందనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆమెకు తెలుగులో కొత్త అవకాశాలపై ప్రభావం పడిందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఒకప్పుడు వరుస చిత్రాలతో పాటు స్పెషల్ సాంగ్స్‌కూ మొదటి ఎంపికగా నిలిచిన తమన్నాకు ప్రస్తుతం అలాంటి ఆఫర్లు కూడా తగ్గినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. అయితే తెలుగులో అవకాశాలు తగ్గినా, బాలీవుడ్‌తో పాటు ఓటీటీ వేదికల్లో తమన్నాకు మంచి డిమాండ్ కొనసాగుతోంది. వెబ్ సిరీస్‌లు, గ్లామరస్ పాత్రలు, హిందీ ప్రాజెక్టులతో ఆమె బిజీగా కొనసాగుతోంది. టాలీవుడ్‌లో సక్సెస్ ఆధారంగానే అవకాశాలు లభించే పరిస్థితుల్లో, ఓదెల 2 తర్వాత తమన్నా కెరీర్ గ్రాఫ్ తెలుగులో మందగించినట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే బలమైన కథ, ఆకట్టుకునే పాత్రతో మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చి సత్తా చాటుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది.

బొమ్మరిల్లు భాస్కర్‌కు నాగ్ గ్రీన్ సిగ్నల్?

అఖిల్ అక్కినేని నటించిన లెనిన్ చిత్రం విజయంతో కింగ్ నాగార్జునలో కొత్త ఉత్సాహం కనిపిస్తున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. గత కొంతకాలంగా విజయాల కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా మంచి ఊరటనివ్వగా, కుమారుడి కెరీర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టిన నాగార్జున ఇప్పుడు తిరిగి తన 100వ చిత్రం కింగ్ 100 షూటింగ్‌పై దృష్టి సారించినట్లు సమాచారం. లెనిన్ విడుదల వరకు తన ఇతర ప్రాజెక్టులను పక్కనపెట్టిన నాగార్జున, ఇప్పుడు కింగ్ 100ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో తన తదుపరి చిత్రాల ఎంపికలోనూ నాగార్జున జాగ్రత్తగా అడుగులు వేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇటీవల విడుదలైన కూలీ చిత్రంలో ఆయన చేసిన పాత్రకు ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో, ఇకపై ప్రధాన హీరో పాత్రలకే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్ వినిపించిన కొత్త కథకు నాగార్జున గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం భాస్కర్ పూర్తి స్థాయి స్క్రిప్ట్ సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో అఖిల్‌తో మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన భాస్కర్, ఇటీవల సిద్ధు జొన్నలగడ్డతో రూపొందించిన జాక్ చిత్రంతో ఆశించిన ఫలితం అందుకోలేకపోయారు. అయినప్పటికీ, గత కొన్ని నెలలుగా సిద్ధం చేసిన కొత్త కథ నాగార్జునను ఆకట్టుకున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ ప్రాజెక్టుపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. త్వరలోనే చిత్ర బృందం నుంచి స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

ఆస్కార్ టార్గెట్‌గా రాజమౌళి 'వారణాసి'!



ఆర్ఆర్ఆర్‌తో ఆస్కార్ గెలిచి ప్రపంచవ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటిన దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, తన తదుపరి భారీ చిత్రం వారణాసి తో మరోసారి అంతర్జాతీయ అవార్డులను లక్ష్యంగా పెట్టుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది. తెలుగు సినిమాకు మరిన్ని అంతర్జాతీయ గుర్తింపులు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ చిత్రానికి సంబంధించి గ్లోబల్ ప్రమోషన్, అవార్డుల ప్రచార వ్యూహాలపై రాజమౌళి బృందం ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సమాచారం. ఆర్ఆర్ఆర్ ఆస్కార్ ప్రచార కార్యక్రమాలను సమన్వయం చేసిన రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ, ఆ అనుభవాన్ని వారణాసి కోసం వినియోగించనున్నట్లు తెలుస్తోంది. చిత్రాన్ని ఏయే విభాగాల్లో అవార్డులకు నామినేట్ చేయాలి, అంతర్జాతీయ స్థాయిలో ఎలా ప్రచారం చేయాలనే అంశాలపై ఇప్పటికే బృందానికి స్పష్టమైన కార్యాచరణ ఉందని సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన డోంట్ ట్రబుల్ ది ట్రబుల్ టీజర్ లాంచ్ కార్యక్రమంలో కార్తికేయ మాట్లాడుతూ, భారతీయ చిత్రాలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావాలంటే నాణ్యమైన సినిమాలతో పాటు సమర్థవంతమైన మార్కెటింగ్ కూడా కీలకమని అన్నారు. సరైన ప్రచార వ్యూహంతో ఆస్కార్ వంటి ప్రతిష్ఠాత్మక అవార్డులను సాధించడం సాధ్యమేనని అభిప్రాయపడ్డారు. అయితే వారణాసి ఆస్కార్ ప్రచారంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ నేపథ్యంలో వస్తున్న సమాచారం సినీ వర్గాల చర్చల ఆధారంగానే ఉంది.

రజనీ 'ధర్మన్'లో రుక్మిణి వసంత్

ఇటీవల 'ధర్మన్' చిత్రీకరణతో బిజీగా ఉన్న సూపర్‌స్టార్ రజనీకాంత్ సినిమాలో మరో కీలక నటిని చిత్రబృందం ఎంపిక చేసినట్లు సమాచారం. అశ్వత్ మరిముత్తు దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో కన్నడ నటి రుక్మిణి వసంత్ కీలక పాత్రలో నటించనున్నారు. కమల్ హాసన్‌కు చెందిన రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తుండటంతో ఇప్పటికే సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం దక్షిణాది చిత్ర పరిశ్రమలో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న రుక్మిణి వసంత్‌కు 'ధర్మన్' మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుగా మారనుంది. ఇప్పటికే ఆమె యష్ నటిస్తున్న 'టాక్సిక్', ఎన్టీఆర్–ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రంతో పాటు పలు క్రేజీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఇప్పుడు రజనీకాంత్ సరసన నటించే అవకాశం దక్కడంతో ఆమె కెరీర్‌కు మరింత బలం చేకూరనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ చిత్రంలో రజనీకాంత్, రుక్మిణి వసంత్‌తో పాటు సిమ్రాన్, రాశీ ఖన్నా, యోగి బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, యాక్షన్ సన్నివేశాలను అన్బరివ్ రూపొందిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమాకు సంబంధించిన విడుదల తేదీని ఈ ఏడాది చివర్లో ప్రకటించనున్నట్లు చిత్ర వర్గాలు వెల్లడించాయి.

ప్రపంచ ప్రేక్షకుల కోసం 'రామాయణం'

బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, సాయి పల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'రామాయణం'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. నితీష్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఎపిక్ ప్రాజెక్ట్‌ను భారతీయ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరువ చేసేలా అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కిస్తున్నారు. కమల్ హాసన్ నిర్మాణ భాగస్వామ్యంలోని నిర్మాత నమిత్ మల్హోత్రా మాట్లాడుతూ, 'ద్యూన్', 'ది ఒడిస్సీ' వంటి హాలీవుడ్ విజువల్ వండర్స్‌కు ఏమాత్రం తీసిపోని స్థాయిలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ప్రపంచ ప్రేక్షకులు కూడా ఈ చిత్రాన్ని ఆస్వాదిస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. రామాయణం భారతీయుల భావోద్వేగాలతో ముడిపడిన మహాకావ్యమని, ఈ కథను అంతర్జాతీయ ప్రేక్షకులకు అర్థమయ్యే విజువల్ భాషలో కొత్తగా పరిచయం చేయడం తమ లక్ష్యమని నమిత్ తెలిపారు. అమెరికాకు చెందిన ఓ వ్యక్తి తనతో మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన కథను తమ ముందుకు తీసుకొస్తున్నారని, ఇప్పటివరకు తెలియని కొత్త ప్రపంచాన్ని చూసే అనుభూతి ఈ సినిమా కలిగిస్తుందని చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రపంచ ప్రేక్షకులు ప్రస్తుతం కొత్త తరహా ఎపిక్ కథలను ఆదరిస్తున్న నేపథ్యంలో, భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన ఈ కథను అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్‌తో ఆవిష్కరించడం ఎంతో బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ చిత్రంలో రావణుడి పాత్రలో యష్, హనుమంతుడిగా సన్నీ డియోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో తొలి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027లో విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను జులై 23న శాన్ డియాగో కామిక్–కాన్ (ఎస్‌డీసీసీ) వేదికగా ఆవిష్కరించనుండగా, జులై 24న ట్రైలర్‌ను విడుదల చేసి ప్రపంచవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. భారతీయ సినిమా సత్తాను అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పే చిత్రంగా 'రామాయణం' నిలవనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

'డోంట్ ట్రబుల్ ద ట్రబుల్' టీజర్‌కు రాజమౌళి ప్రశంసలు



తెలుగు చిత్ర పరిశ్రమలో దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి సమర్పణలో రూపొందుతున్న కొత్త చిత్రం డోంట్ ట్రబుల్ ద ట్రబుల్ టీజర్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మలయాళ స్టార్ నటుడు ఫహాద్ ఫాజిల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ ఫాంటసీ థ్రిల్లర్‌కు శశాంక్ యేలేటి దర్శకత్వం వహిస్తున్నారు. ఆర్కా మీడియా వర్క్స్ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని, రాజమౌళి కుమారుడు ఎస్.ఎస్. కార్తికేయ తన షోయింగ్ బిజినెస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన టీజర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. ఇందులో ఫహాద్ ఫాజిల్ సూరి అనే ఇంద్రజాలికుడి పాత్రలో కనిపించనుండగా, దివ్య అనే చిన్నారి చుట్టూ తిరిగే కథ ఆసక్తిని రేకెత్తిస్తోంది. మ్యాజిక్, ఫాంటసీ, థ్రిల్లింగ్ అంశాలతో రూపొందిన ఈ సినిమా విభిన్న అనుభూతిని అందించనున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ చిత్రంలో సారా పాలేకర్, సౌరభ్ సచ్‌దేవా కీలక పాత్రలు పోషించగా, సంగీతాన్ని కాలభైరవ అందిస్తున్నారు. టీజర్ విడుదల అనంతరం దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకులు ఫహాద్ ఫాజిల్, సారా పాలేకర్‌లను కాకుండా కేవలం సూరి, దివ్య పాత్రలనే గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. ఈ పాత్రలు ప్రేక్షకులను నవ్విస్తాయని, భావోద్వేగాలకు గురిచేస్తాయని, టీజర్ ఆ ప్రయాణానికి చిన్న పరిచయం మాత్రమేనని చిత్ర బృందాన్ని అభినందించారు. రాజమౌళి మద్దతు, ఆర్కా మీడియా నిర్మాణ విలువలు, ఫహాద్ ఫాజిల్ నటనతో ఈ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. డోంట్ ట్రబుల్ ద ట్రబుల్ చిత్రం సెప్టెంబర్ 11 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

'తుంబాడ్ 2'లో అలియాభట్?

ఇటీవల 'ఆల్ఫా' సినిమాతో ప్రేక్షకులను అలరించిన బాలీవుడ్ స్టార్ హీరోయిన్ అలియా భట్ మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కల్ట్ హారర్ థ్రిల్లర్‌గా గుర్తింపు పొందిన 'తుంబాడ్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'తుంబాడ్ 2'లో ఆమె కీలక పాత్రలో నటించనున్నారు. ఈ విషయాన్ని 'తుంబాడ్' నిర్మాత, నటుడు సోహం షా మంగళవారం అధికారికంగా ప్రకటించారు. అలియా భట్‌తో కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటూ ఆమె తమ చిత్రబృందంలో చేరినట్లు వెల్లడించారు. 2018లో పెద్దగా ప్రచారం లేకుండా విడుదలైన 'తుంబాడ్' ప్రేక్షకుల ప్రశంసలతో కల్ట్ క్లాసిక్‌గా నిలిచింది. సుమారు రూ.5 కోట్ల వ్యయంతో తెరకెక్కిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.14 కోట్ల వసూళ్లు సాధించడమే కాకుండా, సాంకేతిక విభాగాల్లో పలు అవార్డులను కూడా సొంతం చేసుకుంది. ఆరు సంవత్సరాల తర్వాత 2024 సెప్టెంబరులో రీ–రిలీజ్ చేసినప్పుడు ఈ సినిమా మరోసారి సంచలనం సృష్టించి సుమారు రూ.27 కోట్ల వసూళ్లు రాబట్టింది. దీంతో 'తుంబాడ్'కు కొనసాగింపుగా వస్తున్న రెండో భాగంపై సినీ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇప్పుడు అలియా భట్ వంటి స్టార్ హీరోయిన్ ఈ ప్రాజెక్టులో భాగం కావడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. 'తుంబాడ్ 2'ను 2027 డిసెంబరు 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Hyderabad, Telangana State. Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244 Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277